# కుండపోత వర్షంతో...తమిళ సరిహద్దులు అతలాకుతలం

తడ, డిసెంబర్ 12 ప్రభాతవార్త : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో తమిళనాడు సరిహద్దుల్లో మళ్లీ వానలు దంచికొడుతున్నాయి. బుధ, గురువారాల్లో కుండపోత వర్షం కురవడంతో జనజీవనం పూర్తిగా స్తంభించింది. ముఖ్యంగా తడ మండలంలో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పలు పల్లెల రోడ్లపై మోకాటి లోతు నీళ్లు నిలిచిపోయాయి. కాళంగి నది, పాముల కాలువ మరోసారి ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కరిపేటి కాలువ సమీప పంట పొలాలను ముంచెత్తినట్లు రైతులు తెలిపారు. బుధవారం ఉదయం నుంచి గురువారం సాయంత్రం దాకా తడలో 104.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోద యింది. ఇప్పటికే రెండు వారాల క్రితం కురిసిన భారీ వర్షాలు ప్రభావంతో మండల పరిధిలోని వందలాది ఎకరాలు నీట మునగగా, ఇప్పుడు మళ్లీ జోరు వానతో వరదలు రావడం తడ మండల రైతన్నకు శాపంగా మారింది. గురువారం రాత్రికి సైతం వర్షం జల్లులు తగ్గకపోవడంతో మండలంలోని తీర ప్రాంత గ్రామాల ప్రజలు వరద భయంతో విలవిల్లాడుతున్నారు.

- నిండుతున్న నదులు, కాలువలు - స్తంభించిన జనజీవనం



తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# మళ్లీ వానలతో...అతలాకుతలం

**-తిరుపతి జిల్లాలో స్తంభించిన జనజీవనం -తిరుమల ఘాట్‌లో జారినబండరాళ్ళు**



ఘాటరోడ్డులో జారిపడ్డ బండరాళ్ళు

తిరుమల,డిసెంబర్ 12 ప్రభాతవార్తప్రతినిధి: తుఫాన్ ప్రభావంతో మళ్ళీ జోరువానలతో తిరుమల, తిరుపతి ప్రాంతాలు అతలాకుతలంగా మారాయి. రెండురోజులుగా కురుస్తున్న జోరువర్షాలకు తిరుపతి జిల్లా వ్యాప్తంగా ప్రజాజీవనం స్తంభించింది. తిరుపతి నగరంలో పలురోడ్లన్నీ జలమయంగా మారాయి. తిరుపతి జిల్లాలో గురూవారం ఉదయం నుండి సాయంత్రం వరకు దాదాపు 78.3మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. తిరుపతిలో 63మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకాగా రూరల్‌లో 69 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. మళ్ళీ తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలతో తిరుపతి జిల్లావ్యాప్తంగా అన్ని చెరువులు, వాగులు నిండి ప్రవహిస్తున్నాయి. తిరుపతినగరంలో వరదనీరు రోడ్డుపై నిలిచిపోవడంతో వాహనాలు పూర్తిగా మునిగిపోయే పరిస్థితి ఉంది. లక్ష్మీపురంకూడలిలో వరదనీటిలో వాహనాలు ఆగిపోయాయి. తిరుపతిలో కపిలతీర్థం ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో ఎంతగానో ఆకర్షిస్తుంది. 24 గంటలుగా ఎడ తెరపి లేకుండా భారీగా కురుస్తున్న వర్షాలకు తిరుమల, తిరుపతి జిల్లా వ్యాప్తంగా లోతట్టు ప్రాంతాలు జలమయ్యాయి. తిరుమల రెండో ఘాట్‌లో 41వ మలుపు హరిణి కుటీరం సమీపంలో గురువారం మధ్యాహ్నం కొండల్లోంచి పెద్దబండ రాయి జారిరోడ్డుపై పడింది. దీనికి తోడు భారీ వృక్షాలు, మట్టి కొట్టుకురావడంతో ఘాట్‌లో తిరుమలకు వచ్చే రోడ్డుపై వాహనాలు స్తంభించిపోయాయి. మరో మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలతో జిల్లా అధికారులు కూడా అప్రమత్తంగా ఉంటూ ఎవరూ కూడా కాలువలు, కాజ్‌వేలు దాటే ప్రయత్నం చేయరాదని హెచ్చ రించారు. అన్ని డివిజన్ కేంద్రాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటుచేసి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. తిరుపతిలో వెస్టుచర్చి సమీపంలోని అండర్ బ్రిడ్జిక్రింద భారీగా వరదనీరు చేరడంతో వాహనాలను దారి మళ్ళించారు. కపిలతీర్థం పుష్కరిణిలోనికి భక్తులను నిలుపుదలచేశారు. లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి.

## వర్షాలకు పొంగుతున్న వాగులు,వంకలు

**- నీటమునిగిన పంటలు -ఆందోళనలో రైతన్నలు**



మద్దలవంక వాగు ప్రవాహ పరిస్థితిని పరిశీలిస్తున్న ఎస్ఐ

వెదురుకుప్పం, డిసెంబర్ 12 ప్రభాతవార్త : ఎడతెరిపి లేకుండ కురుస్తున్న వర్షాలకు చెరువులు కుంటలు నిండుకుండను తలపిస్తూ ఉండటంతో వాగులు వంకలు పొంగిపోరలుతున్నాయి. మండలంలో ఇటీవల వరుస తుఫాన్లతో వర్షాలు కురవడంతో చెరువులు, కుంటలు నిండిపోగడంతో రైతన్నలు సాగు నీటి కష్టలు తీరనున్నాయని ఆనందం వ్యక్తపరుస్తున్నా మరో వైపు చేసిన పంటలు నీటమునిగి నష్టం కల్గచేసిందని ఆందోళన చెందుతున్నారు. గురువారం తెల్లవారు జాము నుంచి ఏడతెరిపి లేకుండ వర్షాలు కురుస్తుంటంతో జనజీవనం పూర్తిగా స్తంభించింది, వరి నాట్లు వేసిన రోజులు గడవకముందే భారీగా, విస్తరంగా వర్షాలు కుస్తుండటంతో వరి పంట నీటమునిగి తీవ్ర నష్టం వాట్లిలిం దని ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి పంట నష్టం అంచనావేసి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు. ఆళ్ళమడుగు సమీపంలో రహదారిపై విద్యుత్ స్తంభాలు విరిగిపడిన సంఘ టన జరిగింది. వాగులు ఉధృతంగా ప్రవహించి ప్రధాన రహదారి మార్గంలో రాకపోకలకు కష్టతరంగా మారింది. మండలంలోని మద్దిలమడుగు వంక ప్రవాహ వేగంను ఎస్ఐ వెంకటసుబ్బయ్య తన సిబ్బందితో కలిసి పరిశీలించారు. ప్రస్తుతంకు ఉధృతి తక్కువగా ఉందని, మరీంత వర్షం కురిస్తే మద్దలవంక దాటడం కష్టతరంగా మారవచ్చని ప్రయాణికులు, వాహన చోదకులు ఉధృతి పరిస్థితిని చూసి వాహనాలు నడపాలని చూచించారు. ప్రజలు అత్యవసరమైయితే తప్ప బయట తిరగవద్దని సురక్షిత ప్రాంతాలలో ఉండాలని తెలిపారు.



## సూళ్లూరుపేటలో ముంచెత్తిన వాన



కోటపోలూరు అండర్ రైల్వే బ్రిడ్జి కింద వర్షపు నీరు



సూళ్లూరుపేట, డిసెంబర్ 12 ప్రభాతవార్త : బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో గురువారం భారీ వర్షం సూళ్లూరుపేటను ముంచెత్తింది. బుధవారం రాత్రి నుంచి చిరుజల్లులతో ప్రారంభమైన వర్షం, గురువారం ఉదయానికి భారీ జల్లులతో విరుచుకుపడింది. మధ్యాహ్నానికి ఈ జల్లులకు గాలులు తోడవడంతో ఉరుములు మెరుపులతో భారీ వర్షం పట్టణ ప్రజలను భయకంపితులను చేసింది. నాలుగు గంటలు పాటు ఎడతెరిపి లేని జోరు వర్షం కురవడంతో జనజీవనం పూర్తిగా స్తంభించింది. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇళ్ల నుంచి వెలుపలికి వచ్చేందుకు జనాలు హడలిపోయారు. అసలు ఏమి జరుగుతుందో తెలియని విధంగా వర్షం అతలాకుతలం చేసింది. పట్టణంలోని రోడ్లన్నీ జలమయం అయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు ఇళ్లలోకి చేరుకుంది. గమండ్లవీధి, జిఎన్‌టి రోడ్డు, షార్ వై జంక్షన్, ఇందిరా నగర్, నాగరాజపురం, బాపూజీ కాలనీ తదితర ప్రాంతాల్లో వర్షపు నీరు నడుములోతు వరకు రోడ్లపై పారాయి. డ్రైనేజిలు పొంగి ప్రవహించడంతో ఇళ్లలోకి ఆ బురద నీరు చేరుకొని దుర్గంధం వెదజల్లింది. ఎక్కడపడితే అక్కడ వాహనాలు రోడ్లపైనే నిలిపేసి వాహన చోదకులు సురక్షిత ప్రాంతాలకు చేరుకున్నారు. ఇందుకు తగ్గట్టుగా కాళంగి నది డ్యాం గేట్లు ఎత్తివేయడంతో వరద నీరు సూళ్లూరుపేట పరివాహక ప్రాంతాలకు చేరుకుంటుందని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారుల సూచనలతో సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ఆర్డీఓ కిరణ్మయి ఆధ్వర్యంలో తహశీల్దార్ ఎస్‌వి నరసింహారావు, కమిషనర్ కె.చిన్నయ్య లోతట్టు ప్రాంతాల ప్రజలను పరామర్శించారు.

## లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన కమిషనర్



నగరంలోని లోతట్టు ప్రాంతాల్లో పర్యటిస్తున్న నగర కమిషనర్

తిరుపతి కార్పొరేషన్, డిసెంబర్ 12 ప్రభాతవార్త : వరదల నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే తప్ప బయట రావద్దని, నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది అందరూ ప్రజలకు అందుబాటులో ఉండాలని కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. గురువారం నగరంలోని లోతట్టు ప్రాంతాలైన కొరమేనుగుంట, గొల్లవానిగుంట, ఆటోనగర్, పూలవాణి గుంట, లక్ష్మిపురం కూడలి, బాలాజి కాలని, డి.ఆర్.మహల్ రోడ్డు, అండర్ బ్రిడ్జి, కేశవాయన గుంట, నారాయణ పురం తదితర ప్రాంతాల్లో కమిషనర్ పర్యవేక్షించి, ప్రజలకు ఇబ్బంది లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికా రులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలకు ఎటువంటి ఇబ్బందులూ కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేశామన్నారు. లోతట్టు ప్రాంతాల్లోనూ, ఇబ్బందులు పడే ప్రజల కోసం ప్రత్యేకంగా 17 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని, అందులో అన్ని సౌకర్యాలు కల్పించాలని అన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలిగినా వెంటనే హెల్ప్ లైన్ నంబర్లను 08772256766, 9000822909 సంప్రదించాలని, తమ సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంటారని అన్నారు. కమిషనర్ వెంట డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డీఎస్పీ రామకృష్ణ ఆచారి, తహసీల్దార్ భాగ్యలక్ష్మి, రెవెన్యూ ఆఫీసర్ సేతు మాధవ్, రవి, డి.ఈ.లు, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, అధికారులు, శానిటరీ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతీ, సిబ్బంది ఉన్నారు.

# వరదల పట్ల ప్రజలు అప్రమత్తంగా వుండండి

**-అరణియార్, కాలంగి రిజర్వేయర్లు ఎత్తివేత -సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం**



అరణియార్ గేట్లను ఎత్తేసిన దృశ్యం

నారాయణవనం, డిసెంబర్ 12 ప్రభాతవార్త : తుఫాన్ ప్రభావం నేపథ్యంలో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా వుండాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కోరారు. భారీ వర్షాలు కారణంగా నియోజకవర్గంలోని నారా యణవనం, పిచ్చాట్బూరు. నాగలాపురం, సత్యవేడు, కెవిబిపురం, వరదయ్య పాలెం, బుచ్చినాయుడుకండ్రిగ మండలాల్లో ఎడ తెరపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపద్యంలో ప్రజలు అప్రమత్తంగా వుండాలని, అలాగే లోతట్టు ప్రాంతం ప్రజలను సురక్షిత ప్రాంతాలకు సంబందిత అధికారులు తరలించి వారికి ఆశ్రమం కల్పించాలని కోరారు. అలాగే పిచ్చాటూరు మండలంలోని అరణియార్ రిజర్వేయర్లు 4గేట్లను తెరిచి వెయ్యి క్యూసెక్కుల నీటిని బయటకు వదులుతు న్నట్టు గుర్తు చేశారు. అలాగే కెవిబిపురం మండలం కాళంగి రిజర్వేయర్ గేట్లను కూడా తీయడంతో నది పరివాహక ప్రాంతం ప్రజలు జాగ్రత్తగా వుండాలన్నారు. పిచ్చాటూరు-శ్రీకాళహస్తీ వైపు రాకపోకలను ఆపేసినట్టు గుర్తు చేశారు. నది దాటే సమయంలో జాగ్రత్తలను పాటించాలన్నారు. కురుస్తున్న భారీ వర్షంతో నదులు, వాగులు, వంకలు కూడా ఉధృతంగా ప్రవహిస్తున్నట్టు చెప్పారు. ప్రజలకు ఏదైనా సమస్య వస్తే తన దృష్టికి తీసుకోస్తే ఇల్లా కలెక్టర్‌కి సమాచారం చేరవేసి వారికి న్యాయం జరిగే విధంగా సహకరిస్తానన్నారు. ఇకపోతు వరదయ్యపాలెం మండలం గోవర్ధనగిరి వాగు ఉధృతంగా ప్రవహిస్తుడడంతో చెన్నై వరకు రాకపోకలను అధికారులు ఆపేశారని, అత్యవసరమైతేనే ఇంటి నుంచి బయటకు రావాలని కోరారు.

## నాయుడుపేటలో ఎడతెరిపిలేని వర్షం

నాయుడుపేట, డిసెంబరు 12 ప్రభాతవార్త : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో నాయుడుపేట మండలంలో బుధవారం రాత్రి నుండి ఎడ తెరపిలేని వర్షాలు పడుతున్నాయి. కురుస్తున్న వర్షాలకు నాయుడుపేట పట్టణం లోని లోతట్టు ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజల నివాసాల్లోనికి వర్షపునీరు చేరడంతో తంటాలు పడుతున్నారు. నాయుడుపేట పట్టణంలో పారిశుద్ద్యం లోపించి దుర్గంధం వెదజల్లుతుంది. గ్రామాల్లో రోడ్లు,వీధులు బురదమయంగా మారుతున్నాయి. గ్రామాల్లో చెరువులు,గుంటలు నిండు కుండను తలపిస్తున్నారు. స్వర్ణముఖినది, మామిడికాలువ ఉదృతంగా ప్రవహిస్తుంది. వర్షాలకు గ్రామాల్లో పారిశుద్ద్యం లోపించి విషజ్వరాలు ప్రబలతున్నాయి. నాయుడుపేటలో కురుస్తున్న వర్షాలకు జాతీయ రహదార్లుసైతం గుండలుపడి అద్వానంగా మారుతున్నాయి. మరో రెండురోజులు భారీవర్షాలు కురుస్తాయన్న వాతావరణశాఖ హెచ్చరికలతో నాయుడుపేట తహశీల్దార్ రాజేంద్ర గురువారం తనసిబ్బందితో కలిసి స్వర్ణముఖినది -మామిడికాలువ బ్రిడ్జిలు,వరద ప్రవాహన్ని పరిశీలించారు. అధికారులు అప్రమతంగా ఉండి లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు.

# ఆరోగ్య రంగంలో ఆవిష్కరణల కోసమే హ్యాకథాన్

**-ముగిసిన హ్యాకథాన్ గ్రాండ్‌ఫినాలే -36 గంటలు పోటీలు...విజేతలకు బహుమతులు**




స్టాక్‌స్క్వాడ్ విన్నర్ ఆర్ఎంకె కళాశాల విద్యార్థులకు బహుమతి అందించిన దృశ్యం

శ్రీకాళహస్తి,డిసెంబర్ 12 ప్రభాతవార్త : తిరుపతి ఐఐటిలో నిర్వహించిన స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ గ్రాండ్‌ఫినాలే సాఫ్ట్‌వేర్ ఎడిషన్ పోటీలు గురువారం ముగిసాయి. రాత్రి ముగింపు సమావేశానికి ఐఐటి డైరెక్టర్ ప్రొఫెసర్ కెఎన్ సత్య నారాయణ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా స్విమ్స్ వైస్ ఛాన్సలర్,ఏఐసిటిఇ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రొఫెసర్ రాజేష్‌కుమార్ గుంజు హాజరయ్యారు. 36 గంటల పాటు సుదీర్ఘంగా జరిగిన పోటీల్లో నాలుగు అంశాలకు సంబంధించి ఐదుగురు విజేతలుగా ప్రకటించారు. గెలుపొందిన వారికి ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున ప్రోత్సహక బహుమతులను అందించారు. 36 గంటల పాటు సాగిన కార్యక్రమాల్లో విద్యార్థులు పోటీలు పడ్డారు.ఈ కార్యక్రమాల్లో కీలకమైన వాటాదారు ఆయుష్ మంత్రిత్వశాఖ సాంకేతికను ఉపయోగించి ఆరోగ్య రంగంలో ఆవిష్కరణలను నడిపించే లక్ష్యంతో పాల్గొన్న వారికి నాలుగు ప్రత్యేకమైన సవాళ్ళను అందించినట్లు డైరెక్టర్ సత్యనారాయణ వివరించారు. హ్యాక్‌థాన్ 2024లోల వారి చాతుర్యం ప్రతిభ,టీం వర్క్, అవిశ్రాంత కృషిని అభినందిస్తూ ప్రోత్సహకంగా ధృవీకరణ పత్రాలను అందించారు.

**ఎందరు పాల్గొన్న గెలిచేది కొందరే:**

తిరుపతి ఐఐటిలో జరిగిన ప్రతిష్టాత్మక హ్యాక్‌థాన్ 2024లో సుమారు 350 మంది భారత దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. 36గంటల పాటు సాగిన ఈ కార్యక్రమాలను నిర్వహించటంలో అద్భుతమైన విజయాన్ని సాధించిందని డైరెక్టర్ అభినందించారు. సహాకారాన్ని పెంపొందిం చటం ఆరోగ్యం,మరియు ఆరోగ్యంలో దేశం యొక్క సవాళ్ళను ప్రతిభా వంతమైన పరిష్కారాలను రూపొందించటానికి యువ మనస్కులు చూపిన శ్రద్దను అభినందించారు.ఈ సందర్భంగా వివిధ అంశాలల్లో గెలుపొందిన వారి పేర్లను వేదిక పై ప్రకటించారు. స్టాక్‌స్క్వాడ్ అంశానికి సంబందించి విజేతగా తమిళనాడులోని ఆర్ఎంకె ఇంజనీరింగ్ కళాశాలకు ప్రగతి మిత్రా విజేత మొదటి బహుమతిని గెల్చుకున్నారు.కోడ్‌క్రాఫ్ట్‌లో విజేతగా యుఐఐటి పంజాబ్ యూనివర్శిటి సహవిరిన్‌దాం కార్బన్ డేటర్స్‌లో పూనేకు చెందిన ఆర్మీ ఇన్‌స్టిట్యూట్ టెక్నాలజీకి సహావియదాం వారు దక్కించుకున్నారు. మరో విజేతగా కౌశల్ వ్యాస్ ఎంపికయ్యారు. ఈ అంశంలో జాయింట్ విన్నర్స్‌గా ప్రకటించినట్లు నిర్వాహాకులు ప్రకటించారు.విజేతలకు బహుమతులను అందించారు. విజేతలకు ఒక్కొక్కరికి లక్ష రూపాయల చొప్పున నగదు బహుమతిని అందించారు. కార్బన్‌డేటర్స్‌ను జాయింట్ విజేతగా ప్రకటించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి స్విమ్స్ వైస్ చాన్సలర్ రాకేష్‌కుమార్ గుంజూ మాట్లాడుతూ ఇలాంటి ఆవిష్కరణలతో తిరుపతి ఐఐటికి భారతదేశంలో ప్రఖ్యాతి చెందిన ఐఐటిలలో గుర్తింపు వస్తుందన్నారు.ఇప్పటికే స్వల్పకాలంలో దేశ వ్యాప్తంగా 51యూనివర్శిటీల్లో నిర్వహించిన హ్యాక్‌థాన్‌లో అవకాశం సంపాదించటం ప్రగతి పరుగులకు నిదర్శనం అన్నారు. ఇలాంటి కార్యక్రమా లతో విద్యార్థుల్లో శాశ్వత స్థానం సాధించగల్గుతున్నారన్నారు. అంతేకాక రెండు సార్లు ప్రధాని నరేంద్రమోదీజి అభినందించటం ప్రత్యేక గుర్తింపుకు నిదర్శనం అని గుంజూ అభినందించారు. ముగింపు సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ సమిష్టి కృషితో ఏదైనా సాధించవచ్చునని తమ సిబ్బంది నిరూపించారన్నారు. ఇలాంటి ఆవిష్కరణలు ఇంకా ఎన్నో తీసుకొస్తామని తిరుపతి ఐఐటికి ప్రపంచ స్థాయిలోనే గుర్తింపు తెస్తామని వివరించారు.

# రీసర్వే తెచ్చిన తంటా... రైతుల భూములకు ఎసరు!

**-తప్పుల తడకగా నమోదైన భూ రికార్డులు -అర్జీలపై అర్జీలు సమర్పిస్తున్నరైతులు**
**-రెవెన్యూ సదస్సుల్లో సైతం అవే వినతులు -తలలు పట్టుకుంటున్న అధికార యంత్రాంగం !!**



కుప్పం, డిసెంబర్ 12 ప్రభాతవార్త : గత వైఎస్సార్సీ పాలనలో జగనన్న భూరక్ష పేరిట చేసిన భూముల సమగ్ర రీసర్వేలో జరిగిన తప్పులతో రైతుల భూములకు పలుచోట్ల ఎసరు పడింది. రీ సర్వేలో తమ భూముల వివరాలు తప్పుల తడకగా నమోదయ్యాయని రైతులు అధికారులకు ఏకరువు పెట్టి తమకు ప్రభుత్వం న్యాయం చేస్తుందని ఆశగా ఎదురుచూస్తున్నారు. గత వైఎస్సార్సీ ప్రభుత్వం రీసర్వే అనంతరం రైతులకు అందజేసిన పాస్ పుస్తకాల్లో మార్పులు, చేర్పులకు దాదాపు ఏడాది పాటు ఎలాంటి అవకాశం ఇవ్వకపోవడంతో రైతుల్లో ఆందోళనలు చోటుచేసుకున్నాయి. మరో పక్క తమ భూములకు సంబంధించిన పాస్ పుస్తకాలపై అప్పటి సిఎం జగన్ వేయడం, భూముల చుట్టూ నాటిన రీసర్వే రాళ్లపై జగన్ బొమ్మలు ఉండడం రైతులను మరింత కలవరపెట్టాయి. వైఎస్సార్సీ పాలనలో రీసర్వేలో పలుచోట్ల డ్రోన్‌ల ద్వారా సైతం సర్వేలు చేసి భూహద్దులు గుర్తించారు. దీంతో ఓ రైతుకు చెందిన భూమి మరో రైతు ఖాతాలో పడిపోవడం వంటి సమస్యలు ఉత్పన్నమ య్యాయి. అప్పటినుంచి రైతుల భూసమస్యల పరిష్కారం అధికారులకు పెద్ద సవాల్‌గా మారింది.

**అర్జీల రూపంలో రైతులు ఏకరువు :**

తమకు జీవనాధారంగా మారిన వ్యవసాయ భూములు రీసర్వేద్వారా కొంత మేర కొల్పోయిన రైతులు ప్రస్తుతం అధికారులకు అర్జీల రూపంలో ఏకరువు పెడుతు న్నారు. జిల్లా కలెక్టర్లు, డిఆర్‌ఒలు, ఆర్డీఒలు, తహశీల్దార్లు ఇలా ఏ అధికారికి అయినా రెవెన్యూ సమస్యలపైనే రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున వినతిపత్రాలు సమర్పిస్తున్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాలకు భూసమస్యలపైనే వినతులు అధికంగా వస్తుండడం గమనార్హం. అయితే రైతులు ఒకే సమస్యపై పలు మార్లు వినతిపత్రాలు ఇస్తుండడంతో అధికార యంత్రాంగం తలలు పట్టుకు ంటోంది. ప్రస్తుతం భూసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో సైతం రీసర్వే భూసమస్యలపైనే అధికంగా రైతులు వినతులు అందిస్తున్నారు. ఒక్క కుప్పం నియోజకవర్గంలో అటు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, ఇటు కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్‌లకు అందుతున్న వినతుల్లో భూ సమస్యలపై వస్తున్న వినతులే అధికంగా ఉన్నాయి. రీసర్వేలో తప్పుల తడకగా నమోదైన వివరాలను ఎలా పరిష్కరించాలనే అంశంగా ఇప్పుడు చర్చకు దారితీస్తోంది.

**ప్రభుత్వం నిర్ణయమే కీలకం :**

రీసర్వేతో ఏర్పడిన భూ సమస్యలను ప్రభుత్వం రెవెన్యూ సదస్సుల అనంతరం ఎలా పరిష్కరిస్తు ందనే విషయం ఇప్పుడు ఆసక్తిగా మారింది. సిఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం మరలా కొత్తగా భూములసర్వే చేపట్టి సమస్యను పరిష్కరిస్తుందా లేక ఇదివరకే ఉన్న పాత రికార్డులు పరిశీలించి భూములు కోల్పోయిన రైతుల రెవెన్యూ రికార్డుల్లో భూముల వివరాలు నమోదు చేస్తారా అనే అంశంపై ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ప్రభుత్వం రెవెన్యూ సదస్సుల అనంతరం భూ సమస్యల పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకుంటుందో చూడాలి. సిఎం చంద్రబాబునాయుడు తమకు తప్పక న్యాయం చేస్తారని రైతులు, ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

## ఎస్వీయూలో అక్రమ వసూళ్లు!

తిరుపతి విద్య, డిసెంబర్ 12 ప్రభాతవార్త : ఎస్వీయూలో వింత సంస్కృతికి తెరలేపారు. తాత్కాలిక ఉద్యోగులను టార్గెట్ చేస్తూ యూనియన్ల పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని పలువురు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే వర్సిటీలో పనిచేస్తున్న సుమారు 3000 మందికి పైగా తాత్కాలిక ఉద్యోగులు చాలీచాలని జీతాలతో కుటుంబాలను నెట్టికొస్తున్నారు. ఈ నేపథ్యంలో రెండు నెలల జీతాలు ఎట్టకేలకు ఈనెల మొదటి వారంలో ఉద్యోగులకు జమ కావడంతో కాస్త ఊపిరి పీల్చుకున్నారు. ఇంతలోనే వర్సిటీలో పనిచేస్తున్న కొందరు తాత్కాలిక ఉద్యోగుల యూనియన్లు అభివృద్ధి కోసం,ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం విజయవాడలోని ఉన్నత అధికారులను ప్రభుత్వ నేతలను కలిసేందుకు రవాణా ఖర్చుల పేరుతో వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఐదు రూపాయలు నుంచి ఐదు వేల వరకు, ఒక్కో ఉద్యోగి ముక్కు పిండి వసూలు చేస్తున్నారని సిబ్బంది మొరపెట్టు కుంటున్నారు. చాలీచాలని జీతంతో జీవనం సాగిస్తున్న తమ నుంచి యూనియన్ల పేరుతో నగదు ఫోన్ పే చేయాలంటూ బలవంతం చేస్తున్నారని వాపోతున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఫోన్ పే స్క్రీన్‌ను ఉద్యోగులకు పంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే లక్షల్లో సొమ్ము వసూళ్లు అయిందని చిరుద్యోగులైన తమను వేధించడం దారుణమని అధికారులు ఈ విషయంపై దృష్టి సారించాలని వర్సిటీ తాత్కాలిక ఉద్యోగులు వేడుకుంటున్నారు.



## భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



- ఎపిఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం

**కుప్పం, డిసెంబర్ 12 ప్రభాతవార్త :** రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారానికే సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో అధికారులు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఎపిఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. గురువారం మండలంలోని కంగుందిలో తహశీల్దార్ చిట్టిబాబు నేతృత్వంలో రెవెన్యూ సదస్సు జరిగింది. ఈసందర్భంగా ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ మాట్లాడుతూ గత వైకాపా పాలనలో చేపట్టిన జగనన్న భూరక్ష కార్యక్రమం రైతుల పాలిట భూభక్షగా మారిపోయిందన్నారు. భూముల రీసర్వే పేరిట భూముల వివరాలు తప్పులతడకగా నమోదు చేసి పాసుబుక్కులు ఇవ్వడంతో రైతులు లబోదిబోమంటున్నారన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ వేణుగోపాల్, విఆర్వో శ్రీనివాసులుగౌడ, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## ప్రజల్లోకి తెదేపాను మరింత బలంగా తీసుకెళ్లాలి



**కుప్పం, డిసెంబర్ 12 ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీని ప్రజల్లోకి మన టిడిపి యాప్ ద్వారా మరింత బలంగా తీసుకెళ్లాలని తీసుకెళ్లాలని ఎపిఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం సూచించారు. గురువారం కుప్పం తెదేపా కార్యాల యంలో మన టిడిపి యాప్ ద్వారా పార్టీ సమాచారాన్ని ప్రజల్లో తీసుకెళ్లి యాభైవేల పాయింట్లు సాధించిన తెదేపా సభ్యులను ఐటిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రవణ్‌కుమార్, కుప్పం ఐటిడిపి అధ్యక్షుడు రాజే ంద్రప్రసాద్ నేతృత్వంలో ఘనంగా సత్కరించడంతో పాటు సిఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్‌లు పంపిన ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు శ్రీమల్లేశ్వరాలయంలో కార్తీక దీపోత్సవం



**కుప్పం, డిసెంబర్ 12 ప్రభాతవార్త :** మండలంలోని కంగుంది దుర్గంలో వెలసిన పురాతన శ్రీ మల్లేశ్వరస్వామి ఆలయం, శ్రీవిరూపాక్షేశ్వరస్వామి ఆలయాల్లో శుక్రవారం కార్తీక దీపోత్సవం కార్యక్రమంతో పాటు గిరి ప్రదక్షిణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. అనంతరం సాయంత్రం లక్ష దీపాల వెలిగింపు, కంగుంది దుర్గంపై కార్తీక దీపోత్సవం, అన్నదానం, సాయంత్రం స్వామివారి ఉత్సవ ఊరేగింపు, దుర్గం గిరిప్రదక్షిణ కార్యక్రమాలు జరుగుతాయ న్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

## కస్తూరిబా గురుకులంలో సరస్వతి విగ్రహం ప్రతిష్ట

గుడుపల్లె, డిసెంబర్ 12 ప్రభాతవార్త :



మండలంలోని కస్తూరిబా గాంధీ గురుకుల పాఠశాలలో కుప్పం లయన్స్‌క్లబ్ అధ్వర్యంలో సరస్వతిదేవి విగ్రహంను గురువారం ప్రతిష్టించారు. అలాగే విద్యార్థుల కోసం సమావేశ వేదికను ఏర్పాటు చేయించారు. లయన్స్‌క్లబ్ సలహాదారు డాక్టర్ మహేష్ మాట్లాడుతూ సుబ్ర మణ్యం, మరికొందరు సభ్యులు ముందుకు వచ్చి గురుకులంలో సరస్వతి విగ్రహం ఏర్పాటుకు సహకరించారన్నారు. వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు సెంధిల్, చరణ్, పిజి సెల్వం, లెనిన్, పాఠశాల ఎస్వో మాధవి, ఉపాధ్యాయినులు, బాలికలు పాల్గొన్నారు.

## ఉపాధిహామీ పనుల్లో 8.80లక్షల నిధులు పక్కదారి



**శాంతిపురం, డిసెంబర్ 12 ప్రభాతవార్త :** మండలంలో 23-24లో చేపట్టిన ఉపాధిహామీ పనుల్లో రూ8,800211ల నిధులు పక్కదారి పట్టాయని ఎపిడి మల్లికార్జున వెల్లడించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ పనుల సామాజిక తనిఖీ బహిరంగసభను నిర్వహించారు. పంచాయతీల వారీగా జరిగిన నిధుల పక్కదారి విషయంగా సిఆర్‌పిలు వివరాలు వెల్లడించారు. 23-24లో మండలంలో 8.76 కోట్ల మేర పనులు జరిగాయి. ప్రస్తుతం పక్కదారి పట్టిన 8.80లక్షల నిధుల రికవరీకి ఎపిడి ఆదేశించారు. కార్యక్రమంలో ఎపిడి వెంకటరత్నం, ఎంపిడిఓ పిఆర్‌కుమార్, ఎస్ఆర్‌పి మల్లికార్జున, ఎపిఒ హరినాథ్, మండల టిడిపి అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, నేతలు రమేష్, నాగరాజు పాల్గొన్నారు.

## టూవీలర్‌ను తప్పించబోయి పొలాల్లో వెళ్లిన బస్సు

శాంతిపురం, డిసెంబర్ 12 ప్రభాతవార్త :



కుప్పం-పలమనేరు జాతీయ రహదారిలో కదిరి ఓబనపల్లి వద్ద ఓ టువీలర్‌ను తప్పించబోయి ఆర్టీసీ బస్సు పొలాల్లో దూసుకెళ్లింది స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా.. గుడుపల్లె మండలంకు చెందిన ఓ యువకుడు కొరియర్ సర్వీస్‌లో పనిచేస్తూ తన టూ వీలర్‌లో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును గమనించక నేరుగా అడ్డంగా వెళ్లాడు. దీంతో ఆర్టీసీ బస్సు డ్రైవర్ చాకచక్యంతో బస్సును పొలాల్లోకి తిప్పేశాడు. టువీలర్‌లో వస్తున్న యువకుడికి గాయాలు కావడంతో అతన్ని చికిత్స నిమిత్తం పిఇఎస్‌కు తరలించారు.

## భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు :మాజీ ఎమ్మెల్సీ

**శాంతిపురం, డిసెంబర్ 12 ప్రభాతవార్త :**



రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించుటకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం సోడగబల్లలో జరిగిన సదస్సులో ఆయన ప్రసంగించారు. గత వైకాపా పాలనలో ప్రజలు, రైతులు ఎదుర్కొన్న భూ సమస్యలను సిఎం చంద్రబాబునాయుడు సత్వరమే పరిష్కరించేలా రెవెన్యూ సదస్సుల నిర్వహణకు ఆదేశించారన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ శివయ్య, మాజీ సర్పంచులు గోపాల్, గంట్లప్ప, నేతలు మంజునాథ్, సలావాద్, వెంకటేష్, బాపుసాబ్, బాలప్ప, కృష్ణప్ప, మునిరత్నం, శేఖర్, ఉమాపతి, మహబూబ్, ఈశ్వరమ్మ, రైతులు పాల్గొన్నారు.



## పచార్లచెరువు ఒడ్డుకు గండి

-మరమ్మతులు చేపట్టిన తహశీల్దార్

**యర్రావారిపాలెం, డిసెంబర్ 12 ప్రభాతవార్త :** యర్రావారిపాలెం మండలం చింతగుంట పంచాయతీ చిన్నబైలు పచ్చారు. వాండ్లపల్లి దగ్గర పచ్చార్ల చెరువు ఒడ్డు కురస్తున్న వర్షాలకు గండి పడింది. సమాచారం అందుకున్న యర్రావారి పాలెం తహసీల్దార్ పరమేశ్వరస్వామి, యర్రావారిపాలెం ఎస్ఐ డి.వై.స్వామి చెరువు దగ్గరకు చేరుకొని స్థానిక అధికారులతో కలిసి మరమ్మతులు చేసి గండిని పూడ్చారు. అధికారుల వెంట టిడిపి మండలపార్టీ అధ్యక్షులు దేశిరెడ్డి రఘునాథ, ప్రధానకార్యదర్శి మహేష్ నాయుడు, నాగభూషణం స్థానికనాయకులు ఉన్నారు.

## నేడు స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ

-విజయవాడకు తరలివెళ్ళిన ప్రముఖులు, రైతులు

-జెండా ఊపి బస్సును ప్రారంభించిన ఇన్‌ఛార్జీ కలెక్టర్ జి.విద్యాధరి

**చిత్తూరు, డిసెంబర్ 12 ప్రభాతవార్త:** వికసిత్ భారత్-2047 కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి చెందిన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో రూపొందించిన స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్‌ను విజయవాడ ఇందిరా గాంధీ స్టేడియంలో శుక్రవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆవిష్క రించనున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి జిల్లా నుండి ప్రముఖులు, రైతులు గురువారం సాయంత్రం బయలుదేరి వెళ్ళారు. వీరు బయలుదేరిన వాహనాలను గురువారం సాయంత్రం కలెక్టరేట్ ఎదుట జిల్లా ఇన్‌ఛార్జీ కలెక్టర్ జి.విద్యాధరి జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి వెళ్తున్న ప్రముఖులు, రైతులకు జిల్లా అధికార యంత్రాంగం ఆరు బస్సులను ఏర్పాటు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, డ్వామా పిడి రవికుమార్, డిఎల్‌డిఓ రవికుమార్, కలెక్టరేట్ ఎఓ కులశేఖర్, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## రాజకీయ పార్టీ ముసుగులో... నియంత పార్టీగా వైకాపా

- రాష్ట్ర తెలుగుదేశం అధికార ప్రతినిధి వెంకిటీల సురేంద్రకుమార్

చిత్తూరు, డిసెంబర్ 12 ప్రభాతవార్త: రాష్ట్రంలో రాజకీయ పార్టీ ముసుగులో వైకాపా నియంత పార్టీగా వ్యవహరిస్తుండటంతో ఆ పార్టీ నుండి రోజుకొక్కరు వీడి బయటికి వస్తున్నారని రాష్ట్ర తెలుగుదేశం అధికార ప్రతినిధి వెంకిటీల సురేంద్రకుమార్ అన్నారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైకాపా పార్టీలో ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఏకపక్ష నిర్ణయాలు వుంటాయని, నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోరని ఆరోపించారు. గురువారం వైకాపా పార్టీకి అవంతి శ్రీనివాస్, గ్రంధి శ్రీనివాసులు గుడ్‌బై చెప్పి వచ్చేయడం దీనికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలో తిరిగి వైకాపాకు అధికారం కట్టబెట్టే యోజన ప్రజల్లో లేదని ఆయన స్పష్టం చేశారు.

## రైతు సమస్యలపై నేడు వైకాపా పోరాటం

చిత్తూరు, డిసెంబర్ 12 ప్రభాతవార్త:

రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం అమలు చేస్తామన్న అన్నదాత సుఖీభవ కార్యక్రమంను అమలు చేయకపోవడం, రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించకపోవడంపై ప్రతిపక్ష వైకాపా పార్టీ శుక్రవారం రోడ్డెక్కనుంది. చిత్తూరు అసెంబ్లీ వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త ఎంసి విజయానందరెడ్డి ఆధ్వర్యంలో వైకాపా నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ఉదయం 9.30 గంటలకు చిత్తూరు దుర్గమ్మ గుడి నుండి ర్యాలీగా వెళ్ళి కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసి రైతు సమస్యలపై వినతిపత్రం అందజేయనున్నారు. ఈ కార్యక్రమానికి చిత్తూరు, పూతలపట్టు, గంగాధం నెల్లూరు, పలమనేరు, కుప్పం, పుంగనూరు నియోజకవర్గాల నాయకులు, కార్యకర్తలు పాల్గొంటారని చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త ఎంసి విజయానందరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

## గ్రామకంఠంను కబ్జా చేసిన తెలుగు తమ్ముళ్ళు

పాలసముద్రం, డిసెంబర్ 12 ప్రభాతవార్త:

పాలసముద్రం మండలం పాలసముద్రం పంచాయతీ దళితవాడకు సమీపంలో లక్షల రూపాయల విలువైన ప్రభుత్వ భూమిని అధికార తెలుగుదేశం పార్టీ నాయకులు కబ్జా చేశారని ప్రజలు వాపోతున్నారు. ఈ స్థలంపై ఎప్పటి నుంచో కన్నేసి వుంచిన అధికార తెలుగుదేశం పార్టీ నేతలు అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. కొంతమంది తెలుగుదేశం పార్టీ నేతలు ఈ స్థలంను స్వాధీనం చేసుకోవడానికి రంగం సిద్ధం చేశారు. ఈ విషయంపై అధికారులు విచారించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## వర్షాలతో మరింత అప్రమత్తం

- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు - ఇన్‌ఛార్జీ కలెక్టర్ జి.విద్యాధరి

**చిత్తూరు, డిసెంబర్ 12 ప్రభాతవార్త:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలతో ప్రజలు మరింత అప్రమత్తంగా వుండాలని జిల్లా ఇన్‌ఛార్జీ కలెక్టర్ జి.విద్యాధరి పేర్కొన్నారు. జిల్లాలో కురుస్తున్న వర్షాలతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను పరిష్కరించడానికి కలెక్టరేట్‌లోని పాత గ్రీవెన్స్ హాలులో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని ఇన్‌చార్జీ కలెక్టర్ తెలిపారు. అలాగే రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లోని ఆర్డీఓ కార్యాలయాల్లో సైతం తుఫాను కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. కలెక్టరేట్‌లోని పాత గ్రీవెన్స్ హాలులో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు ఎదైనా సమాచారం అందించాలనుకుంటే 94910 77356, 08572- 242777 నెంబర్లకు దయల్ చేసి సమాచారం అందించాలన్నారు. అలాగే చిత్తూరు అర్డీఓ కార్యాలయంలో 94910 77011, కుప్పం అర్డీఓ కార్యాలయంలో 99660 72234, పలమనేరు అర్డీఓ కార్యాలయంలో 94910 74510, నగరి అర్డీఓ కార్యాలయంలో 96521 38325 నెంబర్లతో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామన్నారు.

## రేపు పెద్దచెరువుల నీటి సంఘాలకు ఎన్నికలు

చౌడేపల్లి, డిసెంబర్ 12 ప్రభాతవార్త:

ఈనెల 14న మండలంలోని నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు డిప్యూటీ తహశీల్దార్ మాధవి తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 9 నీటిసంఘాలు, 2382మంది ఓటర్లున్నారన్నారు. ఎన్నికలను రైతులు సహకరించాలని కోరారు.

## భక్తి మార్గంతో సత్ప్రవర్తన క్రమశిక్షణ

కల్లూరు, డిసెంబర్ 12 ప్రభాతవార్త :



సమాజంలో భక్తి మార్గంతో సత్ప్రవర్తన క్రమశిక్షణ కలిగి ఉండవచ్చునని చిత్తూరు జిల్లా పురోహిత బ్రాహ్మణ సంఘం గౌరవ సలహాదారులు వేద పండితులు హెచ్.ఎన్ రాజశేఖర్ దీక్షితులు అన్నారు. కర్ణాటక రాష్ట్రం ములబాగుల్ తాలూకా ఏబీని గ్రామస్తులు తిరుమలకు పాద యాత్ర చేపట్టారు. ఈ నేపథ్యంలో తిరుమల పాదయాత్ర భక్తులు గురువారం కల్లూరుకు చేరుకున్నారు. వర్షం ఎక్కువగా ఉండడంతో పాదయాత్రకు అనుకూలంగా లేకపోవడంతో వేద పండితులు వారికి వసతి సౌకర్యాన్ని కల్పించి అల్పాహారం అందించారు. తిరుమలకు గ్రామస్తులు పాదయాత్ర చేయడం ఎంతో ధర్మ మార్గమని వేద పండితులు పేర్కొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## కిశోరబాలికల ఆరోగ్యమే ప్రధానం : ఐసిడిఎస్ పిడి



**పుంగనూరు రూరల్,డిసెంబరు 12 ప్రభాతవార్త :** పధ్నాలుగేళ్ళ వయసు దాటిన బాలికల ఆరోగ్య సంరక్షణ కోసం కేంద్ర,రాష్ట్రప్రభుత్వాలు అనేక చర్యలు తీసుకుంటున్నాయని,వారికి సరైన పౌష్టికా హారం, సమతులాహారం అందించే బాధ్యత ప్రభుత్వాలే తీసుకున్నాయనని,వారి ఆరోగ్యమే సమాజానికి ముఖ్య మని అన్నారు. గురువారం ఉదయం మండల పరిషత్తు కార్యాలయంలో జరిగిన ఐసిడిఎస్ శిక్షణాశిబిరంలో ఆమె ప్రసంగించారు. బాలికల ఆరోగ్యరక్షణ కోసం ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.సిడిపిఓ రాజేశ్వరి మాట్లాడుతూ పుంగనూరు నియోజకవర్గ పరిధిలో అన్ని అంగన్‌వాడి కేంద్రాలలో కిశోరబాలికలకు సంపూర్ణపథకాలు,ఉచితాలు అందచేస్తూ వారి ఆరోగ్య రక్షణ పట్ల శ్రద్ద వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఇఓలు చంద్రశేఖరరెడ్డి,రెడ్డెన్నశెట్టి,ఎస్ఐ లోకేష్, పిహెచ్‌సి వైద్యాధికారి సల్మాబేగంతో పాటూ అంగన్‌వాడి వర్కర్లు సిబ్బంది పాల్గొన్నారు.

## సత్వరం గ్రామసమస్యల పరిష్కారం



**పుంగనూరు రూరల్,డిసెంబరు 12 ప్రభాతవార్త :** రెవిన్యూ సదస్సులు పూర్తయిన వెంటనే అత్యంత వేగంగా ఆయా గ్రామాల సమస్యలు పరిష్కరించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని తహసీల్దార్ రాము అన్నారు. మండలంలోని భీమగానిపల్లి రెవిన్యూ గ్రా మంలో గురువారం జరిగిన రెవిన్యూ సదస్సులో గ్రామస్తుల వద్దనుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు వేంకట రమణయాదవ్, గంగాధర్,గంగుపలప్ప,శ్రీనివాస్,జనార్ధన్ పాల్గొన్నారు.

## వరసిద్దుని సన్నిధిలో ఆలయ పునర్నిర్మాణ దాత



**కాణిపాకం,డిసెంబర్ 12 ప్రభాతవార్త:** కాణిపాకం ఆలయ పునర్నిర్మాణం, బంగారు, వెండి వాకిలిల నిర్మాణ దాత గొట్టిపాటి శ్రీనివాస్ గురువారం కుటుంబ సమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. వారి వెంట ఈఈ వెంకటనారాయణ, సూపరెండెంట్‌లు కోదండపాణి, వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

## నీవానది పరివాహక ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటన



**చిత్తూరురూరల్, డిసెంబరు 12 ప్రభాతవార్త:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా నగరంలో గురువారం ఉదయం నుంచి భారీగా వర్షం కురుస్తుండడంతో నగరంలో నీవానది, పలు ప్రాంతాల్లో నీటి ప్రవాహ పరిస్థితిని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అధికారులతో కలసి పరిశీలించారు. తేనబండ, లిల్లీబ్రిడ్జి ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేస్తూ, ముందస్తుగా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేసారు. అలాగే తేనబండ వద్ద నీవానదిలో నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా ఎప్పటికప్పుడు తొలగించాలనీ, ప్రవాహ పరిస్థితిని అంచనా వేసుకుంటు స్థానిక ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ ఏర్పాట్లలో ఇన్‌ఛార్జీ కమీషనరు వెంకటరామిరెడ్డి, ఎంహెచ్‌వో డా.లోకేష్,డిప్యూటీమేయర్‌రాజేష్‌కుమార్‌రెడ్డి, స్థానిక నాయకులు, నగరపాలక అధికారులు పాల్గొన్నారు.

## గ్రామాల్లోనే భూ సమస్యలకు పరిష్కారం



**పందిళ్ళపల్లి(చౌడేపల్లి), డిసెంబర్ 12 ప్రభాతవార్త :** గ్రామాల్లోనే భూసమస్యలు పరిష్కారానికి ఇంటి ముందుకే అధికారులు వస్తున్నారని తేదేపా యువనేత మాదిరాజు ప్రదీప్‌రాజు అన్నారు. మండలంలోని పందిళ్ళపల్లి పంచాయతీ బాల సముద్రంలో రెవిన్యూ సదస్సును నిర్వహించారు. గత వైకాపా ప్రభుత్వం హయాంలో భూ ఆక్రమణలు యథేచ్ఛగా జరిగాయని ఆరోపించారు. ఎన్డీయే కూటమి తేదేపా ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత దురాక్రమణలకు అడ్డుకట్ట వేశారన్నారు. అంతేకాకుండా భూసమస్యలు తీర్చేందుకు రెవిన్యూ అధికారులు గ్రామాలకు వచ్చి మరీ రైతులను అడుగుతున్నారన్నారు. డిటి మాధవి, ఆర్ఐభారతి, మండలసర్వేయర్‌గుణశేఖర్, సర్పంచుకదిరప్ప, రైతులు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## కిషోర బాలికలు సామాజిక స్పృహ కల్గివుండాలి



**చౌడేపల్లి, డిసెంబర్ 12 ప్రభాతవార్త :** కిషోర బాలికలు సామాజిక స్పృహ కల్గివుండాలని ఎస్ఐ నాగేశ్వరరావు అన్నారు. స్థానిక మండల పరిపాలనా భవనం నందు ఐసిడిఎస్ ఆధ్వర్యంలో 'కిషోరీ వికాసం'పై సచివాలయ అధికారు లకు శిక్షణలిచ్చారు. ఐసిడిఎస్ ఎసిడిపిఓ అమరజ్యోతి, ఎంఇఓ కేశవరెడ్డి, ఐకెపి ఎపిఎం సుబ్రమణ్యం, వైద్యాధికారులు పవన్ కుమార్, నవీన్‌కుమార్, ఎఓ షబ్బీర్ అహ్మద్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు రమాదేవి, సులోచనా, సచివాలయాల అధికారులు పాల్గొన్నారు.

## బాలికల భవిషత్తుకు కిశోర వికాసం

గుడుపల్లి,డిసెంబరు 12 ప్రభాతవార్త :

బాలికల భవిషత్తుకు కిశోర వికాసం ,బాలికల ఉజ్వల భవిషత్తుకు ఇది మంచి కార్యక్రమం అని మండల తాహశీల్దారు శీతారాం పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవనంలో జరిగిన బాలికల కిశోరి వికాసం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బాలికలకు ఇది ఎంతో మంచి కార్యక్రమం అని అన్నారు. బాలికలు చదువులోనే కాకుండా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని వారికి అన్ని విధాలుగా సాధికారత దిశగా పనించేందుకు సమిష్టికృషితో చేయూతనందించడమే ఈకార్యక్రమ లక్ష్యం అని అన్నారు. అనంతరం ఎంపిడిఓ రాధాకృష్ణ మాట్లాడుతూ బాలికలకు విద్య,ఆరోగ్యం, భద్రత, ఆర్థికస్వాలంబన మెరుగుపరచడం ఈకార్యక్రమంయొక్క లక్ష్యం అన్నారు. అనంతరం సిడిపిఓ క్రిష్ణవేణి మాట్లాడుతూ బాలికల భవిషత్తుకు మంచి పునాదిగా ఈకార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని అన్నారు. ఈకార్యక్రమంలో ఇపిఆర్‌డి సద్గుణ,సుపర్‌వైజర్ సుజాత,అధికారులు,ఐసిడియస్ సిబ్బంది పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## కాలనీలు జలమయం:జనజీవనం ఆగమ్యగోచరం

సహాయక చర్యల్లో ఎంఎల్ఏ: దేవస్థానం నుంచి భోజనాలు

శ్రీకాళహస్తి,డిసెంబర్ 12 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పట్టణంలోని పరిసర కాలనీలు,పట్టణంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. జన జీవనం ఆగమ్యగోచరంగా మారింది. అయితే ముందుగానే వాతావరణ కేంద్రం ఈ నెల 12న భారీ వర్షాలు కురుస్తాయని ప్రకటించటంతో శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అప్రమత్తమయ్యారు. అధికారులతో సమీక్షించుకుంటూ వారిని అప్రమత్తం చేసారు. మూడు నెలలుగా అల్పపీడనాలు, తుఫాన్లుతో ఉపాధి కోల్పోతున్న నిరుపేదల కాలనీలకు గురువారం దేవస్థానం నుంచి భోజనాలు పంపారు. గురువారం సాయంత్రం అందిన సమాచారం మేరకు 145 మి.మీలు వర్షపాతం నమోదైంది. పట్టణంలోని శివారు గ్రామాల్లో పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది.

పొంగిపొర్లుతున్న పనసకోన:

శ్రీకాళహస్తి చుట్టుపక్కల కోనలు వెలసి ఉన్నాయి. ఓవైపు వేయిలింగాల కోన జలపాతం, మరో వైపు పనస కోన జలపాతాలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దాంతో శివారు కాలనీలు జలమయమయ్యాయి. పనస కోన నీటితో జగనన్న కాలనీ జలమయ్యామయ్యాయి.

ఈ నీరు శ్రీకాళహస్తిలోని మంచినీళ్ళ గుంటకు చేరుతుంది. శ్రీకాళహస్తిలోని జయరామారావువీధి, పాత నెల్లూరుబస్టాండు కూడలి, దక్షిణ కైలాస నగర్, శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రి మార్గాలు పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. ఎస్‌డికె నగర్ మొత్తం జలమయమయ్యాయి. ఇక ఆర్‌టిసి బస్టాండు నుంచి ఏరియా ఆసుపత్రి వరకు వర్షపు నీటితో జలమయమైంది. కాగా ఈ మార్గంలోని చెంచులక్ష్మికాలనీ జనం బిక్కు బిక్కు మంటూ గడుపుతున్నారు.

అధికారులతో సమీక్ష:

శ్రీకాళహస్తి నియోజకవర్గం బంగాళాఖాతంలో అల్పపీడనంతో భారీ వర్షాల కారణంగా శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ఆర్‌డిఓ భానుప్రకాష్‌రెడ్డి, శ్రీకాళహస్తీశ్వరాలయం దేవస్థానం ఇఓ టి.బాపిరెడ్డితో సమీక్షించారు. దేవాలయం నుంచి వరదనీటిలో చిక్కుకున్న కాలనీలకు దేవస్థానం నుంచి భోజనాలు పంపారు. ఎప్పటికప్పుడు ఆర్‌డిఓ భానుప్రకాష్‌రెడ్డితో సమన్వయంతో సమీక్షించుకుంటూ సహాయక చర్యలను చేపట్టారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపు నిచ్చారు.

ఎక్కడిక్కడ కాలువలను ఆక్రమించుకోవటంతో పరిస్థితి ఆగమ్య గోచరంగా మారింది. శ్రీకాళహస్తి పట్టణంలోని పలు ప్రాంతాల్లో గురువారం శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి తన సహచరులతో కలసి పరిస్థితిని పరిశీలించారు. మాజీ మార్కెటింగ్ కమిటి చైర్మెన్ చెంచయ్యనాయుడు, పట్టణ అధ్యక్షుడు విజయకుమార్‌నాయుడుతో కలసి పరిశీలించారు.

## డిసెంబర్‌లో సాధారణం కన్నా అధికం: తీరిన నీటి కరువు

శ్రీకాళహస్తి,డిసెంబర్ 12 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పరిసరాల్లో ఈ ఏడాది డిసెంబర్ నెల సాధారణ సగటు వర్షపాతం కన్నా అత్యధికంగానే నమోదైంది. గత కొన్ని సంవత్సరాలుగా స్వర్ణముఖిలో వరద ప్రశ్నార్థకంగా మారింది. ఈ ఏడాది కూడా ఇక నదదికి వరద లేదని భావించారు. కానీ వరుణుడు బంగాళాఖాతంలో ఏర్పడ్డ తుఫాను రూపంలో కరుణించాడు. ఒకే రోజు 145 మి.మీ వర్షం కురిపించాడు. నీటి కరువును తీర్చాడు. దాంతో ఇక మూడేళ్ళ వరకు పరివవాహక ప్రాంతాల్లో భూగర్భ జలాలకు దిగుల్లేదని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇక పట్టణంలోని నారద పుష్కరణి, వైష్ణవ కోనేరు ఓ మోస్తరుగా నిండాయి. కాబట్టి పట్టణంలోని పరిసరాలో భూగర్భజలాలకు కొదవ లేదని భావిస్తున్నారు. ఈ ఏడాది అక్టోబర్ మాసం వర్షపాతం సగటు 229 మి.మీలు కాగా 330 మి.మీలు నమోదు అయ్యింది. నవంబర్ సాధారణ సగటు వర్షపాతం 330 మి.మీలు కాగా 230 మి.మీలు నమోదైంది. డిసెంబర్ సాధారణ సగటు వర్షపాతం 174 మి.మీలు కాగా గురువారం వారం ఉదయానికి 145 మి.మీలు నమోదైంది. డిసెంబర్ మొదటివారంలో120మి.మీలవర్షపాతంనమోదైంది. దాంతో రైతుల్లో అనందోత్సాహాలు వెల్లివిరిస్తున్నాయి.

ఎడతెరపి లేని వాన:

ఒండు రోజుల నుంచి శ్రీకాళహస్తి,సత్యవేడు నియోజకవర్గాల్లో ఎడతెరిపిలేని వర్షాలతోనూ, వారం రోజులుగా తీవ్ర చలితో అతలాకుతలమైన శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాలు వణుకుతున్నాయి. చలి, వర్షాలతో వణుకుతున్న జనం రాత్రికి వర్షం కురిస్తే ఏమౌతుందో అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువులు కలుజులు పారుతున్నాయి. స్వర్ణముఖి నది పారుతుంది. లక్షల క్యూసెక్కుల నీరు సముద్రం పాలౌతుంది. ఇక కాళంగి రిజర్వాయర్ గేట్లు ఓపెన్ చేసి కొంత నీటిని సముద్రానికి వదలిపెట్టారు. ఈరెండు ప్రాజెక్టుల నుంచి సముద్రం పాలౌతున్న నీటిని కాపాడుటకు ప్రాజెక్టుల స్థాయిని పెంచాల్సి ఉంది. ఈ మేరకు ప్రజా ప్రతినిధులు చర్యలు తసుకోవాల్సి ఉంది. ఏ ప్రభుత్వం వచ్చినా ఆదిలో ప్రాజెక్టులు ఆనకట్టలంటూ జనాలకు అరచేతిలో స్వర్గం చూపటం తప్ప ఆచరణలో సాధ్యం కావటం లేదు. స్వర్ణముఖి నది ఆధునీకరణ, ఆనకట్ట ఆధునీకరణకు జపాన్‌నిధులు రూ.53కోట్లుతో తెలుగుదేశం ప్రభుత్వం మంజూరు చేసింది. వర్షాల తరువాత పనులు ప్రారంభించుటకు సన్నాహాలు చేస్తున్నారు.

వ్యవసాయపనుల్లో రైతులు:

శ్రీకాళహస్తి నియోజకవర్గం వ్యవసాయ ప్రధాన ప్రాంతం. ప్రతి ఏడాది వర్షాలు ఉన్నా లేకున్నా బావులు,బోర్లుతో వ్యవసాయం చేయటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో చెరువుల కింద వ్యవసాయం సాగుతుంది. దాంతో ప్రతి ఏటా రెండు పంటలు పండిస్తున్నారు. చెరువులు నిండాయి. కాబట్టి ఏడాది చెరువుల కింద వ్యవసాయం కూడా రెండు పంటలు పండించుకోవచ్చునని ఆశిస్తున్నారు. ఈ ఏడాది వ్యవసాయమే ప్రశ్నార్థకంగా మారిన తరుణంలో తుఫాను కారణంగా చెరువులు నిండుతున్నాయి. కాలువలు ఉప్పొంగాయి. జీవనదికి వరదద వచ్చింది, దాంతో వ్యవసాయానికి ప్రాణం వచ్చింది. కానీ మరో వైపు వచ్చిన నీరు ఒకే సారి పారటంతో ప్రయోజనం లేదని వాపోతున్నారు. అయితే అధికారులు నష్టాలను అంచనా వేయటానికే సరిపోతున్నారు.



## రైతుకు అండగా నిలుద్దాం: కదలిరండి

శ్రీకాళహస్తి,డిసెంబర్ 12 ప్రభాతవార్త

రైతులకు అండగా శుక్రవారం నిర్వహించే ఆందోళనకు శ్రీకాళహస్తి నియోజకవర్గ వైకాపా కార్యకర్తలు,ద్వితీయ శ్రేణి నాయకులు కదలి రావాలని మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి పిలుపు నిచ్చారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గం వ్యవసాయానికి పెట్టింది పేరుగా ఉందన్నారు. జగనన్న కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజా సమస్యపై పోరాటాలు సాగించాలని నిర్ణయించారని వివరించారు. ఈ పోరాటాలకు కార్యకర్తలు సిద్ధం కావాలని మధుసూధనరెడ్డి పిలుపు నిచ్చారు. అన్నదాతలకు అండగా వారి సమస్యల పరిష్కారానికి ప్రతిపక్షంగా జిల్లా కలెక్టర్ల కార్యాలయ ఎదుట ధర్నాలకు పిలుపు నిచ్చారని వివరించారు. శ్రీకాళహస్తి నుంచి భారీ ఎత్తున మండలాలనుంచి పార్టీ నాయకులు కార్యకర్తలు జగనన్న అభిమానులు పెద్ద ఎత్తున తరలి వెళ్ళాలని మధుసూధనరెడ్డి పిలుపు నిచ్చారు. ఉదయం శ్రీకాళహస్తి పార్టీ కార్యాలయం నుంచి బయలుదేరాలని కోరారు. ఉదయం 9.30గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేయనున్నట్లు వివరించారు.

## చెరువుల్లా మారిన పంటపొలాలు

తొట్టంబేడు, డిసెంబర్ 12 ప్రభాతవార్త

మండలంలో మంగళవారం రాత్రి నుంచి గురువారం మద్యాహ్నం వరకు 145మి.మీ వర్షపాతం నమోదైంది. దీంతో మండలంలోని వరిపంటపొలాలు చెరువుల్లా దర్శనం ఇస్తున్నాయి. ఈనేపథ్యంలో గురువారం మద్యాహ్నం వరకు ఎడతెరిపిలేని వర్షం నమోదైంది. దీంతో పలుకాలనీలు జలపాతాల్లా దర్శమిస్తున్నాయి. మండలంలో ఎక్కడ చూసినా పంటపొలాల్లో నీరు చేరి ఇవి పంటపొలాలా..లేక చెరువులా అన్నట్లు దర్శనమిస్తున్నాయి. మండలంలోని కొండకోనలు, రాజీవ్‌నగర్ నుంచి వచ్చే నీరంతా మండలంలోని చిట్టత్తూరు పంచాయతీ కొత్తకండ్రిగ గ్రామాన్ని చుట్టుముట్టడంతో ఇక్కడ నీటి ప్రవాహం చెరువుల్లా మారింది. దీంతో సమాచారం అందుకున్న సిఐ తిమ్మయ్య, ఎస్ఐ ఈశ్వరయ్యలు ఇక్కడకు చేరుకుని పరిస్థితిని సమీక్షించి జెసిబితో నీటి ప్రవాహాన్ని మళ్ళించే చర్యలు చేపట్టారు. ఇక ఇదే గ్రామంలో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఇక రాజీవ్‌నగర్ కాలనీ సమీపంలో ఉన్న జగన్న కాలనీలో వదరనీటి ప్రవాహం చుట్టుముట్టింది. అంతేకాకుండా పక్కనే ఉన్న జర్నలిస్టు కాలనీ కూడా ఇదే పరిస్థితి. రాజీవ్‌నగర్ కాలనీలో వీధుల్లో నీటి ప్రవాహాలు వీధుల్లోకి రావడంతోరోడ్లన్నీ జలమయం అయ్యాయి. ఇక పనసకోన వాగు ఉధృతి ఎక్కువైంది. పంటపొలాల్లో వరినాట్లు నీటిలో మునిగిపోగా మరియు కొన్ని పంటపొలాలు చెరువుల్లా మారాయి. ఇక చిట్టత్తూరు పెద్దచెరువులో నీరు ఎక్కువవడంతో స్పందించిన సర్పంచ్ కృష్ణమూర్తి అధికారుల సూచనలతో జెసిబితో గండికొట్టించడంతో గ్రామస్తులు హమ్మయ్య అని ఊపిరిపీల్చుకున్నారు. ఇక బోనుపల్లికి వెళ్ళే మార్గంలో కాళంగి వాగు ఉధృతి పెరగడంతో ఈమార్గంలో రాకపోకలు ఆగిపోయాయి. ఇక కారాకొల్లు గ్రామానికి వెళ్ళేరోడ్డు వద్ద దొంగలమడూరు వాగు ప్రవహిస్తుండడంతో ఈమార్గంలో కూడా రాకపోకలు ఆగిపోయాయి. ఇక దళిత వాడల్లో కాలనీల పరిస్థితి దయనీయంగా మారింది.

## కాలనీలు జలమయం:జనజీవనం ఆగమ్యగోచరం

సహాయక చర్యల్లో ఎంఎల్ఏ: దేవస్థానం నుంచి భోజనాలు

శ్రీకాళహస్తి,డిసెంబర్ 12 ప్రభాతవార్త




శ్రీకాళహస్తి పట్టణంలోని పరిసర కాలనీలు,పట్టణంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. జన జీవనం ఆగమ్యగోచరంగా మారింది. అయితే ముందుగానే వాతావరణ కేంద్రం ఈ నెల 12న భారీ వర్షాలు కురుస్తాయని ప్రకటించటంతో శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అప్రమత్తమయ్యారు.అధికారులతో సమీక్షించుకుంటూ వారిని అప్రమత్తం చేసారు.మూడు నెలలుగా అల్పపీడనాలు, తుఫాన్లుతో ఉపాధి కోల్పోతున్న నిరుపేదల కాలనీలకు గురువారం దేవస్థానం నుంచి భోజనాలు పంపారు.గురువారం సాయంత్రం అందిన సమాచారం మేరకు 145 మి.మీలు వర్షపాతం నమోదైంది. పట్టణంలోని శివారు గ్రామాల్లో పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది.

**పొంగిపొర్లుతున్న పనసకోన:**

శ్రీకాళహస్తి చుట్టుపక్కల కోనలు వెలసి ఉన్నాయి.ఓవైపు వేయిలింగాల కోన జలపాతం, మరో వైపు పనస కోన జలపాతాలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.దాంతో శివారు కాలనీలు జలమయమయ్యాయి. పనస కోన నీటితో జగనన్న కాలనీ జలమయ్యామయ్యాయి.ఈ నీరు శ్రీకాళహస్తిలోని మంచినీళ్ళ గుంటకు చేరుతుంది.శ్రీకాళహస్తిలోని జయరామారావువీధి,పాత నెల్లూరుబస్టాండు కూడలి,దక్షిణ కైలాస నగర్, శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రి మార్గాలు పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. ఎస్‌డికె నగర్ మొత్తం జలమయమయ్యాయి. ఇక ఆర్‌టిసి బస్టాండు నుంచి ఏరియా ఆసుపత్రి వరకు వర్షపు నీటితో జలమయమైంది. కాగా ఈ మార్గంలోని చెంచులక్ష్మికాలనీ జనం బిక్కు బిక్కు మంటూ గడుపుతున్నారు.

**అధికారులతో సమీక్ష:**

శ్రీకాళహస్తి నియోజకవర్గం బంగాళాఖాతంలో అల్పపీడనంతో భారీ వర్షాల కారణంగా శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ఆర్‌డిఓ భానుప్రకాష్‌రెడ్డి,శ్రీకాళహస్తీశ్వరాలయం దేవస్థానం ఇఓ టి.బాపిరెడ్డితో సమీక్షించారు. దేవాలయం నుంచి వరదనీటిలో చిక్కుకున్న కాలనీలకు దేవస్థానం నుంచి భోజనాలు పంపారు.ఎప్పటికప్పుడు ఆర్‌డిఓ భానుప్రకాష్‌రెడ్డితో సమన్వయంతో సమీక్షించుకుంటూ సహాయక చర్యలను చేపట్టారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపు నిచ్చారు. ఎక్కడిక్కడ కాలువలను ఆక్రమించుకోవటంతో పరిస్థితి ఆగమ్య గోచరంగా మారింది.శ్రీకాళహస్తి పట్టణంలోని పలు ప్రాంతాల్లో గురువారం శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి తన సహచరులతో కలసి పరిస్థితిని పరిశీలించారు. మాజీ మార్కెటింగ్ కమిటి చైర్మెన్ చెంచయ్యానాయుడు, పట్టణ అధ్యక్షుడు విజయకుమార్‌నాయుడుతో కలసి పరిశీలించారు.

## చక్కటి ప్రణాళికలు:జాతర ప్రశాంతం

శ్రీకాళహస్తి,డిసెంబర్ 12 ప్రభాతవార్త



శ్రీకాళహస్తిలో ఏడు గంగమ్మల జాతరకు ముందు పోలీసులు హైరానా పడ్డారు. ముందు జాగ్రత్తగా డివిజన్‌లోని 150మంది పోలీసులను రంగంలో దించారు.డివైయస్‌పి నరసింహామూర్తి ప్రణాళికా బద్ధంగా వ్యవహారించారు.13 మందిసిఐలు 20 మంది ఎస్‌ఐలతో బందోబస్తును ఏర్పాటు చేసారు. జాతర ముందు పోలీసులకు మతకలహాలు చోటు చేసుకుంటాయనే సమాచారం ఇవ్వటంతో ఆయన ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. అయితే గతంలో ఎన్నడూ లేని విధంగా పోలీసులు వ్యవహారించారు. పెండ్లిమండపం, కొత్తపేట,గాంధీవీధి, తేరువీధి, జయరామారావు వీధిలోని గంగమ్మలు ప్రధాన రోడ్డుమీద ప్రతిష్టించటంతో అక్కడ ఎలాంటి సమస్య లేకుండా ప్రణాళికలు రూపొందించారు.ఇక్కడ సుమారు 100 అడుగుల దూరంలో బారికేడ్లను ఏర్పాటు చేసారు. అయితే ఈ సారి జాతర సందర్భంగా 'ద్విచక్రవాహనాలను' అనుమతించి కూడా ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు.ఎక్కడా వివాదం లేకుండా పోలీసులు సమర్ధవంతంగా వ్యవహారించారు.

కాలినడకన పరిశీలన:

శ్రీకాళహస్తిలో గంగమ్మ జాతర సందర్భంగా అధికారులు సిబ్బందికి బాధ్యతలు అప్పగించి చేతులు దులుపుకునే వారు. అయితే బుధవారం జాతర సందర్భంగా డివైయస్‌పి నరసింహామూర్తి, సిఐ డి.గోపిలు కాలినడకన నాలుగు మాడావీధుల్లో పర్యటించారు. దాంతో సిబ్బంది అప్రమత్తంగా పని చేసారు.ముఖ్యంగా జయరామారావు వీధి లోని గంగమ్మ వద్ద దృష్టి కేంద్రీకరించారు.ఈ ప్రాంతంలో ముస్లింలు అధికశాతం ఉండటంతో వివాదాలు చెలరేగకుండా ముందుజాగ్రత్తలు తీసుకున్నారు.అలాగే గాంధీ వీధి గంగమ్మ వద్ద కూడా ముందుజాగ్రత్త చర్యలు తీసుకున్నారు. పట్టణంలోని బుధవారం ఉదయం నుంచి ఆటోలు,కార్లు, బస్సులను అనుమతించకపోవటంతో ట్రాఫిక్ సమస్యలేకుండా పోయింది. నిమజ్జనం సందర్భంగా గొడవలు జరగకుండా చర్యలు తీసుకుంటే వరుణుడు సహాకరించాడు.బందోబస్తులో వన్‌టౌన్ సిఐ గోపి,టూటౌన్ సిఐ వెంకటేశ్వర్లు,రూరల్ సిఐ రవినాయక్, బుచ్చినాయుడు కండ్రిగ సిఐ తిమయ్యలు, టౌన్ ఎస్ఐ సుధాకర్‌ల కృషి ప్రశంసనీయంగా మారింది.

## నేడు శివయ్యకు అగ్నితో అభిషేకం

చొక్కాణికి సన్నాహాలు

శ్రీకాళహస్తి,డిసెంబర్ 12 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే సేవలుపూజల్లో మాఘశిర మాసంలో నిర్వహించే సేవ శివయ్యను అగ్నితో పూజించటం ఆనవాయితి.ఈ నేపధ్యంలో చొక్కాణి ఉత్సవం నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపధ్యంలో శుక్రవారం చొక్కాణి ఉత్సవాలకు సన్నాహాలు చేస్తున్నారు. కొత్త ప్రభుత్వ హయాంలో కొత్త ఇవో డి.బాపిరెడ్డి వారం రోజుల నుంచి ఈ మహత్తర కార్యక్రమాలకు సన్నాహాలు చేస్తున్నారు. శుక్రవారం చొక్కాణి ఉత్సవాన్ని నిర్వహిస్తున్నారు.ఈ నేపధ్యంలో ఇఓ ఆలయాధికారులకు బాధ్యతలు అప్పగించారు. కాగా గురువారం రాత్రి ఆలయంలోని అమ్మవారి గర్భగుడి ఎదురుగా బాల దీపాలను వెలిగించి ఊరేగింపుగా ఆలయంలోని నాలుగు ప్రాంతాల్లో ఉత్సవం జరిపి అమ్మవారి గర్భగుడి ఎదురుగా ఏర్పాటు చేసారు. ఈ బాల దీపాలతో శుక్రవారం రాత్రి చొక్కాణి చెట్టును కాల్చుతారు. అగ్నితో స్వామికి అభిషేకిస్తారు.ఈ కార్యక్రమాలు రాత్రి ఏడుగంటలకు నిర్వహించుటకు ఏర్పాట్లు చేపట్టినట్లు ఇఓ బాపిరెడ్డి వివరించారు.స్థానిక భక్తులే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు విశేష సంఖ్యలో పాల్గొంటారని అంచనాలతో ఏర్పాట్లు చేస్తున్నారు.

## టౌన్ ఫీడర్ మీద వత్తిడి: విద్యుత్ సరఫరాకు అంతరాయం:

శ్రీకాళహస్తి,డిసెంబర్ 12 ప్రభాతవార్త

శ్రీకాళహస్తిలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై చుట్టుపక్కల గ్రామాలకు సంబంధించిన సరఫరా భారం మోపటంతో నిరంతరం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది. ఈ నేపధ్యంలో గురువారం ఉదయం నుంచి ఎడతెరపిలేని వర్షం కురుస్తుంది. పానగల్ ప్రాంతంలోని మార్కెటింగ్‌కమిటి, ఆర్‌డిఓ కార్యాలయం, ఎంపిడిఓ కార్యాలయ సముదాయం ఎపిసీడ్స్ కార్యలయం ఉన్న ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా లేక ఇబ్బందిపడుతున్నారు. ఈ ఫీడర్ మీద విశాలాక్షమ్మ కాలనీ వరకు విద్యుత్ సరఫరా అందివ్వటంతో లోడ్ చాలక అంతరాయం కల్గుతుంది.అలాగే పలు ఫీడర్ల మీద చుట్టుపక్కల విస్తరిస్తున్న కాలనీలకు విద్యుత్ సరఫరా ఇవ్వటంతో వర్షాల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.పట్టణ శివారుల్లో కాలనీలకు ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేస్తే బాగుంటుందనే అభిప్రాయం ఉంది.

## నిండిన చెరువులు:రాకపోకలకు అంతరాయం

అడ్డగించిన ఉడమల పాడు నది

శ్రీకాళహస్తిరూరల్,డిసెంబర్ 12 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని మైనర్,మేజర్ ఇరిగేషన్‌కు సంబంధించిన చెరువులు నిండాయి.మండలంలోని పలు గ్రామాలకు రాకపోకలు స్థంభించాయి. శ్రీకాళహస్తి-వెంకటగిరి మార్గంలో ఉడమలపాడు నది అడ్డగించటంతో ఈ ప్రాంతాల్లోని గ్రామాలకు రాకపోకలు స్థంభించాయి.ఇక దొమ్మర పాళెం వద్ద సున్నపు కాలువ పొంగిపొర్లటంతో ఇటు శ్రీకాళహస్తి, అటు తొట్టంబేడు మండలంలోని చియ్యవరం,చొడవరం గ్రామాలకు రాకపోకలు స్థంభించాయి.తొండమనాడు చెరువు కలుజు పారుతుంది. దీనికి అనుబంధంగా ఉన్న ఊరందూరు చెరువు, అక్కుర్తి చెరువు,కమ్మకొత్తురు చెరువులు కలుజులు పారుతున్నట్లు సమాచారం. ఊరందూరు చెరువు పారటంతో నక్కల కాలువలో నీరు పొంగిపొర్లుతుంది. పంగూరు-శ్రీకాళహస్తి మధ్యకాట్రకాయల వద్ద కాలువలు పొంగిపొర్లటంతో పరిస్థితి ఆగమ్య గోచరంగా మారింది. గ్రామాలకు రాకపోకలు స్థంభించటంతో ఏం జరుగుతుందో అంతుపట్టడం లేదు. ఇక మారుమూల గ్రామలైన గొల్లపల్లి,మేలచ్చూరులలో ఏం జరుగుతుందో సమాచారం లేదు.గొల్లపల్లి సమీపంలోని బుగ్గమ్మ గుంటకు కొండలపై నుంచి వరద నీరు చేరుతుంది. కాగా గొల్లపల్లి,మేలచ్చూరులకు వెళ్ళటానికి ఎస్ ఎస్ కెనాల్ వద్ద వంతెన వద్ద రోడ్డు కుంగటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. శ్రీకాళహస్తి నుంచి రామాపురం వెళ్ళు దారితో రోడ్డు ధ్వంసం అయ్యింది. ఈ మండలంలో రామాపురం చెరువు తెగింది. కాలువలు పొంగిపొర్లుతున్నాయి.వాలగల మంద కాలువతో ఓబుళాయిపల్లి రెడ్డి పల్లిలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

అడ్డుకున్న స్వర్ణముఖి:

ఏర్పేడు: ఏర్పేడు మండలంలోని పలు గ్రామాలతో పాటు గుడిమల్లం ఆలయానికి స్వర్ణముఖి నది అడ్డుకోవటంతో పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది.గుడిమల్లం ఆలయానికి వెళ్ళటానికి సీత కాలువ అడ్డంకిగా ఉంది. దాంతో ఆ గుడి చైర్మెన్ బత్తల గిరిబాబు దారి తెలియకుండా రావద్దని హెచ్చరించారు. ఇక మండలంలోని పలు ప్రాంతాల్లో స్వర్ణముఖి నది అడ్డుకుంటుంది. ముఖ్యంగా మోదుగుల పాళెం వద్ద,గోవిందవరం వద్ద స్వర్ణముఖి ఉధృతంగా ప్రవహిస్తుండటంతో సుమారు 50 గ్రామాల జన జీవనం స్థంభించింది.కాజ్‌వేలపై పది అడుగులకు మించి నీరు ప్రవహిస్తుంది.

## వరదనీటిలో తొండవాడ హౌసింగ్ కాలనీ



**చంద్రగిరి, డిసెంబర్ 12 ప్రభాతవార్త:** భారీ వర్షాలకు తొండవాడ ఏపి హౌసింగ్ కాలనీలో రోడ్లు వరదనీటి కాలువలయ్యాయి. గురువారం వేకువజాము నుండి కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షానికి హౌసింగ్ కాలనీ (జగనన్న కాలనీ) ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇన్‌చార్జ్ ఎంపిడిఓ శేఖర్ కాలనీకి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. పంచాయతీ ఈఓ మహేశ్వరయ్య, హౌసింగ్ ఇంజినీరింగ్ అసిస్టెంట్ దినేష్ రెడ్డి, ఇరిగేషన్ ఏఈ హేమాద్రి, హౌసింగ్ డిఈఓ చంద్రశేఖర్ రెడ్డి వరదనీరు ఇళ్ళ మీదకు రాకుండా చూడాలని పంచాయతీ రాజ్ ఏఈ రాజాజీకి ఎంపిడిఓ సూచించారు. ఈ క్రమంలో ప్రజలు వరదనీటి కష్టాలపై రోడ్లు నిర్మించి, కాలనీ సమస్యలను పరిష్కరించాలని అధికారులను కోరారు.

## ముంపు ప్రాంతాలలో పర్యటించిన మోహిత్‌రెడ్డి



**తిరుపతిరూరల్,డిసెంబర్ 12 ప్రభాతవార్త:** తిరుమలనగర్ గ్రామ పంచాయతీ లోని కెబిఆర్ నగర్ లో ముంపు ప్రాంతాలను గురువారం తుడా మాజీ చైర్మెన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పర్యటించారు. ముంపు ప్రాంతాలలో విస్తృతంగా పర్యటించి, అండగా ఉంటానని హామీ ఇచ్చారు. విస్తారంగా కురుస్తున్న వర్షాలకు తిరుపతి అర్బన్ మండలం తిరుమల నగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కెబిఆర్ నగర్‌లో రోడ్లన్ని జలమయం అయ్యాయి. కెబిఆర్ నగర్‌లో ఒంతెన ఏర్పాటుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని తెలిపారు. ఉప మండలాధ్యక్షులు విడుదల మాధవరెడ్డి, వైసిపి నేత శివరాజు తదితరులు పాల్గొన్నారు.

## సెలవు ప్రకటన ఆలస్యం...ఇబ్బందిపడిన విద్యార్థులు



**తిరుపతి, డిసెంబర్ 12 ప్రభాతవార్త:** తుఫాన్ కారణంగా విస్తరంగా కురుస్తున్న నేపధ్యంలో గురువారం ఉదయం ఇన్‌చార్జి కలెక్టర్ స్కూల్స్‌కు ఆలస్యంగా సెలవు ప్రకటన చేయడంతో విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఇబ్బంది పడ్డారు. నిర్విరామంగా కురుస్తున్న వర్షాలకు స్కూల్స్‌కు సెలవు ఇవ్వాలని ఉన్నతాధికారి ప్రకటన చేసారు. కానీ ఉదయం 9గంటలపైన స్కూల్స్‌కు సెలవు ప్రకటన చేసారు. ఉదయం 8గంటల నుండే ప్రవేట్ స్కూల్స్ ప్రారంభమైతాయి. అప్పటికే స్కూల్స్‌కు చేరుకున్న విద్యార్థులు ఇంటికి వెళ్ళటానికి ఇబ్బంది పడ్డారు. స్కూల్స్‌కు వచ్చే సమయంలోను, వెళ్ళే సమయంలోనే విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఇబ్బంది పడ్డారు.

## అగ్రి టెక్నాలజీపై జాతీయ వర్క్ షాప్

తిరుపతివిద్య, డిసెంబర్ 12 ప్రభాతవార్త :

పద్మావతి మహిళా వర్సిటీ డిపార్ట్మెంట్ ఆఫ్ బయో సైన్స్,సిరికల్చర్,డిబెటి బిల్డర్ టీం సంయుక్త ఆధ్వర్యంలో వర్సిటీలో లైవ్ అగ్రి టెక్నాలజీ స్టార్టప్ అవకాశాలు అనే అంశంపై జాతీయ వర్క్ షాప్ నిర్వహించారు.ప్రొఫెసర్ డిఎం మమత ఆధ్వర్యంలో జరిగిన ఈ వర్క్ షాప్‌కు సిట్రస్ రీసెర్చ్ ప్రిన్సిపాల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ సి.మధుమతి ముఖ్యఅతిథిగా విచ్చేసి స్టార్టప్ ఫండింగ్ ఏజెన్సీలు, వ్యవస్థాపక అవకాశాలు ఉద్యానవన రంగంలో సమీకృత వ్యవసాయ నమూనాలపై పలు సూచనలు చేశారు. అనంతరం నంద్యాలకు చెందిన వ్యవసాయ పారిశ్రామిక వేత్త రమేష్ తేనెటీగల పెంపకం ద్వారా స్టార్టప్ అవకాశాలపై అవగాహన కల్పించారు. ఈ వర్క్ షాప్‌లో ప్రొఫెసర్లు సుజాతమ్మ, సావిత్రి,విజయ్ కుమారి, సువర్ణలత, శాంతి, శోభారాణి,హేమావతి,హరిప్రియ, రేఖ,మహిళా శాస్త్రవేత్త శ్వేతకుమారి, రీసెర్చ్ స్కాలర్లు,వివిధ విభాగాల నుండి 200 మందికి పైగా విద్యార్థులు వర్క్ షాప్ లో పాల్గొన్నారు.

## వరద ప్రవాహాన్ని పరిశీలించిన సిఐ

పాకాల, డిసెంబర్ 12 ప్రభాతవార్త:



పాకాల మండలంలో గురువారం మద్ది నాయనపల్లి వైపు కురిసిన వర్షపు నీరుతో ఇప్పటికే అన్ని చెరువులు నిండడంతో గురువారం సాయంత్రం ఐదు గంటల సమయానికి ప్రవాహ వేగం పెరిగి ఊట్లవారిపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి కింద రోడ్డు వంతెన పైన ప్రవహిస్తున్న వరద ప్రవాహ పరిస్థితిని యప్పటికి కప్పుడు పరిశీలిచి ఈ మార్గం లో ప్రయాణిచే వాహనదారులకు తగు సూచనలు చేయవలసినదిగా తమ సిబ్బందికి పాకాల సీఐ మద్దయ్యాచారి ఆదేశించారు.

## ప్రత్యేక ప్రణాళికతో కూడిన చదువు అవసరం

తిరుపతి విద్య, డిసెంబర్ 12 ప్రభాతవార్త:



జోనల్ ఇంచార్జ్ లక్ష్మణ్ ఆధ్వర్యంలో జి.ఆర్.ఆర్.కన్వెన్షన్ హాల్లో తిరుపతి జోన్‌లో ఉన్న పదో తరగతి విద్యార్థులతో భాష్యం విద్యాసంస్థల అధినేత భాష్యం రామకృష్ణతో ఫోటో సెషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా భాష్యం రామకృష్ణ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ పరీక్షలకు ఎలా సిద్ధం కావాలో మంచి భవిష్యత్తు కోసం ఎలా ప్రిపేర్ కావాలో మొదలైన అంశాలను విద్యార్థులకు తెలియజేశారు.అలాగే భాష్యం విద్యాసంస్థల చీఫ్ అడ్వైజర్ మైఖేల్ విద్యార్థులకు ప్రత్యేక ప్రణాళికతో కూడిన చదువు అవసరం అని తెలియజేశారు. భాష్యం విద్యాసంస్థలకు నూతనంగా మేనేజింగ్ డైరెక్టర్ గా బాధ్యతలు తీసుకున్న భాష్యం సాకేత్ రామ్ ని పరిచయం చేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో జోనల్ ప్రిన్సిపల్స్,ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## బ్రిడ్జి గుంతల్లో ఇరుక్కున్న అపాచి బస్సు

వరదయ్యపాలెం, డిసెంబర్ 12 ప్రభాతవార్త:

మాంబట్టు సెజ్‌లోని అపాచీ పరిశ్రమ బస్సు గోవర్ధనపురం బ్రిడ్జి వద్ద నీటి ప్రవాహంలో ఇరుకుంది. బస్సు నిండా కార్మికులు, వాగు నుండా ప్రవహిస్తున్న నీటిని చూసి, కార్మికులు గుండెల్లో ప్రాణభయం మొదలైంది. కాపాడాలంటూ ఆర్తనాదాలు చేశారు, అక్కడే ఉన్న పోలీసులు వెంటనే సహాయక చర్యలు నిమగ్నమయ్యారు. ఈచర్ లారీ, జేసీబీ, ట్రాక్టర్ సాయంతో అపాచీ బస్సులో ఉన్న కార్మికులను సురక్షితంగా బయటికి తరలించారు. ఇదే గోవర్ధనపురం బ్రిడ్జి వద్ద తుఫానులు వర్షాలు వచ్చినప్పుడు జరుగుతున్న పరిస్థితి. వరదయ్యపాలెం పెట్రోల్ బంకు వద్ద నుండి గోవర్ధనపురం ఉబ్బల మడుగుకు వెళ్లే రోడ్డు వరకు నీటి ఉధ్రిక్తత పెరిగింది. ప్రతిసారి ఇదే పరిస్థితి. ఎమ్మెల్యే ఆదిమూలం ఆదేశాలతో తహసీల్దార్ రాజశేఖర్, ఎస్ ఐ కేబి మల్లికార్జున తన సిబ్బందితో సహాయక చర్యలు చేపట్టారు.ఆర్ అండ్ బి అధికారులు స్పందించి బ్రిడ్జి పడిపోయే ప్రమాదంలో ఉందన్న సంగతి గమనించాలని పలువురు కోరుకుంటున్నారు.ఆదమరిచితే అంతే సంగతులు. బైక్ లు నీటి ప్రవాహం చేత గుంతలు గుర్తించలేక పడిపోయి కొట్టుకు పోయే పరిస్థితి ఏర్పడింది.

## శ్రీకాళహస్తి-చెన్నై రహదారిని మూసివేసివేత



వరదయ్యపాలెం, డిసెంబర్ 12 ప్రభాతవార్త : వరదయ్యపాలెం మండలం గత రెండు రోజులగా కురుస్తున్నటువంటి వర్షం కారణం చేత వరదయ్యపాలెం సమీపంలో ఉన్న గోవర్ధనపురంలో కాజువైపై భారీ వరద నీరు రావడంతో రాక పోకలు స్తంభవించింది. ఇటు శ్రీ సిటీ కంపెనీ వెళ్లే ఉద్యోగస్తులు మరియు శ్రీకాళహస్తి-చెన్నై పోవు ప్రయాణికులు బ్రిడ్జ్ దగ్గర ఆగిపోయారు. ఇకనైనా సంబంధిత అధికారులుస్పందించి ప్రతి సంవత్సరం ఆనవాయితీ లాగా వర్షం వస్తే అటు ఇటు రాకపోకలు సంభవిస్తాయని తెలిసిన ఇప్పటి వరకు కొత్త బ్రిడ్జి నిర్మాణం చేపట్టలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తూ ఉన్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు బ్రిడ్జిలు శాంక్షన్ చేసి రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడవలసిందిగా స్థానికులు కోరారు.

## వర్షంలో పట్టించుకోలేదని రోడ్డుపై షికారీలు నిరసన

వరదయ్యపాలెం, డిసెంబర్ 12 ప్రభాతవార్త :



వరదయ్యపాలెం మండలం మండలం చిన్న పాండూరు పంచాయతీ వి.కే.ఆర్.వై.కాలనీ సమీపంలో ఉన్న కాలనీలో కురుస్తున్న వర్షాలకు తమను అధికారులు ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని దాదాపు కొన్ని సంవత్సరాల నుంచి ఇక్కడే నివసిస్తూ ఉన్నాం కనీసం మమ్మల్ని మనుషులుగా కూడా చూడడం లేదు అని ఆరోపించారు. తాగడానికి మంచి నీళ్లు లేవు విద్యుత్ వసతి లేదు చిన్న పాండూరు సమీపంలో ఉన్న షికారులు నిరసనకు దిగారు. ఆ మేరకు గురువారం మధ్యాహ్నం సత్యవేడు వరదయ్యపాలెం ప్రధాన రోడ్డు మార్గంలోని నక్కలమిట్ట వద్ద రోడ్డుపై బైఠాయించి పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. దీంతో వాహన రాకపోకలు రోడ్డుకి ఇరువైపులా స్తంభించాయి. సమాచారం అందుకున్న శ్రీసిటి డిఎస్పి పైడేశ్వరరావు చేరుకుని ఆందోళనకాలతో చర్చించారు. సమస్య పరిష్కారమయ్యే వరకు నిరసనను ఇదే విధంగా కొనసాగిస్తామని స్థానిక షికారులు తెలిపారు.

# తిరుపతి డివిజన్

## దుముకుతున్న కైలాసకోన జలపాతం

నారాయణవనం, డిసెంబర్ 12 ప్రభాతవార్త :



తుఫాన్‌తో కురుస్తున్న భారీ వర్షంతో కైలాసకోన జలపాతం సుమారు సుమారు 25 అడుగుల ముందుకు వచ్చి మళ్లీ దుముకుతున్నది.ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షంతో జలపాతం ఉధృతంగా ప్రవహించడంతో పర్యాటకులు జలపాతంలో స్నాన ం చేయడానికి పోటీ పడుతున్నారు. నడింకోన, శింగరికోనలోను జలపాతం ఉధృతంగా ప్రవహిస్తున్నది. పది రోజుల క్రితం ఫెంగన్ తుఫాన్‌తో దుమికిన జలపాతం ఇటీవల తగ్గింది. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్ ్షంతో మళ్లీ జలపాతంలో నీటి ప్రవాహం పెరిగింది.

## హోటళ్ళను పట్టించుకోని ఫుడ్ సేఫ్టీ అధికారులు

పాకాల, డిసెంబర్ 12 ప్రభాతవార్త :



పాకాల మండల పరిధిలో స్థానికంగా వున్న హోటళ్ళు మరియు గాదంకి టోల్‌ప్లాజాల వద్ద ఏర్పాటు చేసిన కొన్ని హోటల్లలో, ముందు రోజు సేల్ కాకుండా మిగిలిపోయిన వెజ్ నాన్ వెజ్ నాణ్యత లేని ఆహార పదార్థాలు యథేచ్ఛగా విక్రయిస్తున్నారని వినియోగదారుల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. ప్లాజా వద్ద కొన్ని హోటళ్ళో నాసిరకం నూనెలను వాడుతూ ఒకే నూనెని మళ్ళీ మళ్ళీ వాడటం. వంటలో నాసిరకం కాలం చెల్లిన అల్లం వెల్లుల్లి ఫ్లేవర్ పేస్ట్, ఫుడ్ కలర్లతో వండిన ఆహార పదార్థాలను యదేచ్ఛగా తయారుచేసి విక్రయిస్తున్నారు. ఇంత జరుగుతూ ఉన్న ఫుడ్ సేఫ్టీ అధికారులు ఇటు వైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు అని విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వంటశాలలను క్షుణ్ణంగా తనిఖీలు చేసి నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా వినియోగదారులు కోరుతున్నారు.

## రైతుల సంక్షేమమే పరిశోధనల ధ్యేయం కావాలి

తిరుపతి విద్య, డిసెంబర్ 12 ప్రభాతవార్త:



పాడీ రైతుల సంక్షేమమే ధ్యేయంగా యువత నూతన పరిశోధనలకు నాందీ పలకాలని వెటర్నరీ వర్సిటీ వీసీ డాక్టర్ జీవీ రమణ పిలుపునిచ్చారు. ఎస్వీ వెటర్నరీ కళాశాల ఆడిటోరియంలో గత రెండు రోజులగా పీజీ,పీ హెచ్ డీ విద్యార్థులకోసం ఏర్పాటు చేసిన జాతీయ పరి శోధన సదుస్సు ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే ప్రథమంగా అసోసియేట్ డీన్ డాక్టర్ జగపతిరామయ్య ఆధ్వర్యంలో ఇలాంటి సదస్సు జరగడం అభినందనీ యమన్నారు. పశువులకు సంబంధించిన అన్ని రకాల వ్యాధులు, వాటి నివారణ, నిర్ధారణ ప్రక్రియపై పెద్ద ఎత్తున పరిశోధనలు జరగాలన్నారు.యువత గ్రామీణ పాడీరైతు శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని వారికి ఉపయోగపడే విధంగా పరిశోధనలు జరపాలన్నారు.వర్సిటీ ప్రతి ఏడాది యువత వెటర్నరీ పరిశోధకులను ప్రోత్సహించేందుకు చర్యలు చేపడుతోందన్నారు. అనంతరం దేశవ్యాప్తంగా సదస్సుకు హాజరై ఉత్తమ పరిశోధన పత్రాలు సమర్పించిన విద్యార్థులకు అవార్డులను,ప్రశంసాపత్రాలను అందజేశారు.కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి జగపతిరామయ్య,డీన్ వీరబ్రహ్మయ్య, సదస్సు కోఆర్గనైజింగ్ సెక్రటరీలు సుధీర్, మురళి, చైతన్య కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజలను ఆదుకోండి...ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

-మండలంలో 93 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు.



**రేణిగుంట, డిసెంబర్12 ప్రభాతవార్త :** హోదాలను పక్కనపెట్టి తుఫాను బాధిత ప్రజలను ఆదుకోవాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం తుఫాన్ వల్ల కురుస్తున్న వర్షాలకు రేణిగుంట మండలంలోని లోతట్టు ప్రాంతాలని జలమయమయ్యాయి. రేణిగుంట మండలంలో 93 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయి. అన్నాసంపల్లె వెళ్లే మార్గంలో క్యాజ్‌వేపై నుండి వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. సిబిఐడి కాలనీ సమీపంలోని బాలాజీ కాలని నందు ఇళ్ళు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. కొన్ని ఇళ్లలోకి వర్షపు నీరు ప్రవేశించింది. ప్రజలు వంటలు చేసుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆదేశాల మేరకు అధికారులు, టిడిపి శ్రేణులు సహాయక చర్యలకు నడుం బిగించారు. వర్షపు నీటిలో చిక్కుకున్న వారిని స్థానిక యువకుల సహాయంతో ఒడ్డుకు చేర్చారు. తహసిల్దార్ సురేష్ బాబు, ఎంపీడీవో విష్ణు చిరంజీవి సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు. రేణిగుంట అర్బన్ సీఐ శరత్ చంద్ర, రేణిగుంట రూరల్ సీఐ మురళీకృష్ణ, అర్బన్ ఎస్సై అరుణ్ కుమార్ రెడ్డి, గాజులమండ్యం ఎస్సై సుధాకర్ తమ సిబ్బందితో వాగులు, వంకలు, క్యాజువే ల వద్ద ప్రతిష్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. రేణిగుంట పట్టణ టిడిపి అధ్యక్షుడు మహబూబ్ బాషా అధికారులతో కలిసి జలదిగ్బంధ ప్రాంతాలను పరిశీలించి వారికి తక్షణ సహాయ సహకారాలు అందజేశారు. అన్నాసంపల్లి గిరి జనకాలనీలోప్రజలకుటిడిపి సీనియర్ నాయకులు ముచ్చెలి భాస్కర్ రెడ్డి ఆహార పొట్లను పంపిణీ చేశారు.

## రెవెన్యూ సదస్సులకు విశేష స్పందన : తహశీల్దార్

చంద్రగిరి, డిసెంబర్ 12 ప్రభాతవార్త:




భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మీ భూమి మీ హక్కు రెవెన్యూ సదస్సులకు మండలంలో విశేష స్పందన లభిస్తున్నట్లు తహశీల్దార్ శివసుబ్బ రామయ్య తెలిపారు. మండల పరిధిలోని రామిరెడ్డిపల్లిలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రెవెన్యూ విభాగానికి సంబంధించి సమస్యలను అర్జీల రూపంలో తగిన ఆధారాలతో తమకు అందజేస్తే పూర్తి స్థాయి పరిశీలనతో పరిష్కరించగలమన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఓ గిరి, తదితరులు పాల్గొన్నారు.

## కారును ఢీ కొట్టిన ప్రైవేట్ అంబులెన్స్

-మహిళ మృతి... ఐదుగురికి గాయాలు



**చంద్రగిరి, డిసెంబర్ 12 ప్రభాతవార్త:** కారును ప్రైవేట్ అంబులెన్స్ ఢీకొట్టిన ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందగా, ఐదుగురికి రక్తగాయాలయ్యాయి. పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారి తొండవాడ వద్ద తమిళనాడు రాష్ట్రం శివగంగ జిల్లా, మల్లంపట్టి గ్రామానికి చెందిన పంచవర్ణ (54) తమ కుటుంబ సభ్యులతో తిరుమలకు శ్రీవారి దర్శనార్థం వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకున్నది. తిరుపతి నుండి చిత్తూరు వైపుకు వెళుతున్న ప్రైవేట్ అంబులెన్స్ ఎదురుగా వస్తున్న కారును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో పంచవర్ణ (54) మృతి చెందగా, కుటుంబ సభ్యులు నందకుమార్, కళారసు, నందినిరాస, బాలసుబ్రమణ్యం, రాజమ్మాలకు రక్తగాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో 5 నెలల చిన్నారి సురక్షితంగా బయటపడంతో ఊపిరిపీల్చుకున్నారు.

## రామచంద్రాపురంలో భారీ వర్షం

కమ్మపల్లి చెరువుకు స్వల్ప గండి-రాయలచెరువుకు ఎంఎల్ఏ జలహారతి

రామచంద్రాపురం, డిసెంబర్ 12 ప్రభాతవార్త:



రామచంద్రాపురంలో గురువారం భారీ వర్షం కురిసింది. ఎడతెరిపి లేని భారీ వర్షానికి కమ్మపల్లి చెరువుకు భారీగా వరదనీరు చేరడంతో స్వల్ప గండి ఏర్పడింది. ఎంఎల్ఏ పులివర్తి నాని అధికారులతో హుటాహుటిన గండికి మరమ్మతులు చేయించారు. అనంతరం ఎంఎల్ఏ రాయలచెరువు వద్దకు చేరుకుని తూములు, మొరవ కాలువను పరిశీలించారు. టిడిపి నాయకులతో కలసి రాయలచెరువుకు జలహారతి ఇచ్చారు. ఈ క్రమ ంలోనే నెన్నూరులో నక్కలవాగు సమీపంలో కొట్టుకుపోయిన ఆర్అండ్‌బి రోడ్డును పరిశీలించారు. పారకాల్వ, దేసూరికండ్రిగ, బ్రాహ్మణకాల్వ గ్రామాలలో వరదనీరు ప్రవహిస్తుండటంతో వరదనీరు గ్రామాల్లోనికి రాకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి, టిడిపి నాయకులు చినబాబు, జనార్దన్ చౌదరి, కోరా హరిప్రసాద్, తహశీల్దార్ వెంకటరమణ, ఎంపిడిఓ ఇందిర, తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాలకు వాగులో పడి పాడి ఆవు మృతి

**రామచంద్రాపురం, డిసెంబర్ 12 ప్రభాతవార్త:** మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు నెత్తకుప్పం పంచాయతీ, ఎల్వీపురం గ్రామానికి చెందిన కామసాని మునిలక్ష్మికి చెందిన పాడి ఆవు మృతి చెందినది. గురువారం ఉదయం మేతకు వెళ్ళిన ఆవు భారీ సాయంత్రం భారీ వర్షానికి ఉధృతంగా ప్రవహిస్తున్న చీకటి కోన వాగులో పడి కొట్టుకుపోయి మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. వాగు ప్రక్కనే వున్న ఆవును గ్రామస్థులు గమనించి వెలికి తీసే ప్రయత్నం చేశారు. అయితే ఆవు అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. దీంతో బాధితురాలు తనకున్న జీవనాధారం కోల్పోవడంతో కన్నీటి పర్యంతమయ్యారు.

## వెంకన్న సేవలో సినీనటి రాధిక



తిరుమల,డిసెంబర్ 12ప్రభాతవార్తప్రతినిధి:

శ్రీవేంకటేశ్వరస్వామిని గురువారం ఉదయం విఐపి బ్రేక్ దర్శనంలో సినీనటి రాధిక, ఎంఎల్‌సి కంచర్ల శ్రీకాంత్ దర్శించుకున్నారు. ఆలయం వెలుపల రాధికను చూడటానికి అభిమానులు ఆసక్తిచూపారు.

# వర్షంలోనూ...రిలే నిరాహార దీక్షలు



గూడూరు, డిసెంబర్ 12 ప్రభాతవార్త: ఏ.పి.ఎస్.ఆర్టీసీ గూడూరు డిపోలో కండక్టర్, డ్రైవర్ల అక్రమ సస్పెన్షన్‌లను రద్దు చేయాలని గత ఏడు రోజులుగా నిరసన ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా అధికారులలో స్పందన లేకపోవడంతో ఎస్. డబ్ల్యూ.ఎఫ్. రీజనల్ కమిటి నిర్ణయం మేరకు సి.ఐ.టి.యు అనుబంధం ఆధ్వర్యంలో భారీ వర్షం సైతం లెక్కచేయకుండా డిపో ఎదుట గురువారం నుండి రిలే నిరాహార దీక్షలు చేపట్టడం జరిగింది. ఈ దీక్షల్లో అధ్యక్షులు రాము, డిపో కార్యదర్శి డి.శ్రీధర్‌లను సి.ఐ.టి.యు సీనియర్ నాయకులు గుర్రం రమణయ్య ఎర్ర రిబ్బన్లు మెడ లో వేసి దీక్షల్లో కూర్చోబెట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ ట్రేడ్ యూనియన్ల నాయకులు జోగి శివ కుమార్, ప్రజా సంఘాల నాయకులు కె.ఆర్.దాసరి, గూడూరు పట్టణ సి.ఐ.టియు అధ్యక్ష,కార్యదర్శులు, బి.వి.రమణయ్య, ఎస్.సురేష్, ఆటో కార్మిక సంఘం నాయకులు ఆర్. శ్రీనివాసులు, వి.భాస్కర్‌రెడ్డి, కెవిపిఎస్ నాయకులు అడపాల ప్రసాద్, దీక్షలు చేపట్టిన శిబిరం వద్దకు వచ్చి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించడం జరిగింది. దీక్షల్లో ఎస్.డబ్ల్యూ.ఎఫ్. సభ్యులు జి.వి. రమణయ్య, ఎస్.ఎస్.వి.కృష్ణ, రఘురాం, ప్రభాకర్, డి.ఎస్. వాసులు, చంద్రమోహన్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## రెండు కోట్లతో...కాటేజ్ నిర్మాణం పూర్తి



చిల్లకూరు, డిసెంబర్ 12 ప్రభాతవార్త చిల్లకూరు మండలం తూర్పు కనుపూరు గ్రామంలో స్వయంగా వెలిసిన శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ అమ్మవారి దేవస్థానంకి రెండు కోట్లు రూపాయలు విలువ చేసే కాటేజ్‌ని శ్రీ సిటీ యాజమాన్యం సొంతంగా నిర్మించి గురువారం ముత్యాలమ్మ అమ్మవారి దేవస్థానం ఆలయానికి ఉచితంగా ఇవ్వడం జరిగింది. కాటేజ్ నిర్మాణ దాత శ్రీ సిటీ అధినేత సన్నారెడ్డి రవీంద్రరెడ్డి ఆయన సతీమణి మమతమ్మ వారి కుటుంబ సభ్యులు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం కాటేజ సంబంధించిన పత్రాలు తాళాలు ఆలయ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి ఈఓ నవీన్ కుమార్‌కు అప్పగించడం జరిగిందన్నారు. వారికి దేవస్థాన కార్యనిర్వాహణాధికారి చైర్మన్, ధర్మకర్త మండలి సభ్యులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తదుపరి అమ్మవారికి కుంకుమ అర్చన పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వీరి రాకతో అధికా రులు, చైర్మన్ కమిటీ సభ్యులు మంగళ వాయిద్యాల నడుమ పూర్ణ కుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## సచివాలయ సిబ్బందికి శిక్షణా తరగతులు



సూళ్లూరుపేట, డిసెంబర్ 12 ప్రభాతవార్త : సూళ్లూరుపేట మండలంలోని సచివాలయ ఉద్యోగులకు, సర్పంచులకు మండల స్థాయి అధికారులకు గురువారం ఎంపిడిఓ కార్యాలయంలో లోకలైజేషన్ సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ అనే అంశంపై శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ శిక్షణా తరగతులు శుక్రవారం కూడా కొనసాగుతాయని ఎంపిడిఓ ప్రమీలరాణి తెలిపారు. ఈ శిక్షణా తరగతుల్లో గ్రామీణ ప్రాంతాల్లో చేయాల్సిన అభివృద్ధి, పేదరిక నిర్మూలన, పారిశుధ్యం, సురక్షిత మంచినీరు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పన అనే అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ ప్రమీలరాణిలు పాల్గొన్నారు.

## చెరువు కాలువ పూడిక తీయించండి సారూ..!

**- రెవెన్యూ సదస్సులో తహశీల్దార్‌కు వినతి**



తడ, డిసెంబర్ 12 ప్రభాతవార్త : చెరువు నీళ్ల గ్రామాన్ని ముంచెత్తకుండా కాలువను పూడిక తీయించాలని తడ మండలం వెండ్లూరుపాడు రైతులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం కురుస్తున్న జోరు వానలతో కాలువ సరిగా లేని కారణంగా గ్రామంపై నీళ్ల ప్రవహిస్తున్న సమస్యను రెవెన్యూ సదస్సులో వివరించారు. గురువారం వెండ్లూరుపాడులో జోరు వర్షంలోను తహశీల్దార్ శరత్‌బాబు ఆధ్వర్యాన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. అక్కడి పాఠశాల భవనంలో ఈ కార్యక్రమం జరిగింది. పలు సమస్యల మీద రైతులు అర్జీలు అందజేశారు. గ్రామంలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలని, పాఠశాల భవనం, ప్రహరీగోడ నిర్మించాలంటే సర్వే జరిపించాలని కూడా ప్రజలు విజ్ఞప్తి చేశారు. సర్పంచ్ చిల్లకూరు మునిరత్నంరెడ్డి, మాజీ సర్పంచ్ ఓడూరు రవీంద్రారెడ్డి, వేనాటి గిరిరెడ్డి, పర్వతరెడ్డి సుదర్శనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కలుజు పొంగి 300 ఎకరాలు మునక



కోట, డిసెంబర్ 12 ప్రభాతవార్త : గత రెండురోజులుగా కురుస్తున్న వర్షాలు కారణంగా కోట మండలంలోని అల్లంపాడు చెరువు నీటి ప్రవాహం నిండిపోయింది. ఈ క్రమంలో ఆ కాలువ కలుజు పొంగి వరి నాట్లపై ప్రవాహం పడింది. దీంతో 300 ఎకరాల వరినాట్లు మునకకు గురయ్యాయని రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా వరినాట్లు, నారుమడులు తేరుకుంటున్న నేపథ్యంలో మళ్లీ వరుణుడు తమపై ప్రతాపం చూపాడని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి : తహశీల్దార్

కోట, డిసెంబర్ 12 ప్రభాతవార్త : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ కె.జయజయరావు కోరారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. భారీ వర్షాలతో మండలంలోని చెరువు కట్టలను నీటిపారుదలశాఖ ఇంజినీర్లు పరిశీలించాలని ఆదేశించారు. కళ్యాణిడ్యాం రెండు గేట్లు ఎత్తేసిన నేపథ్యంలో చల్లా కాలువకు, స్వర్ణముఖి నదికి వరద ప్రవాహం వస్తుందని చెప్పారు. ఎలాంటి విపత్కర పరిస్థితులైనా ఎదుర్కొనేందుకు మండల యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. కోట తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్‌పాయింట్ ఏర్పాటు చేశామన్నారు. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని సూచించారు.

**వర్షాలతో రెవెన్యూ సదస్సు వాయిదా:**

భారీ వర్షాల కారణంగా కోట మండలం కేశవరంలో గురువారం జరగాల్సిన రెవెన్యూ సదస్సును వాయిదా వేసినట్లు తహశీల్దార్ కె.జయజయరావు చెప్పారు. ఈ సదస్సును తిరిగి జనవరి 6వ తేదీన నిర్వహిస్తామని తెలియజేశారు.

## సాగునీటి సంఘాల్లో ఎన్నికల వేడి

కోట, డిసెంబర్ 12 ప్రభాతవార్త : సాగునీటి సంఘాల ఎన్నికలు ఈ నెల 14న జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో పోటీ చేయడానికి రైతులు ఉవ్విళ్లూరుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం గాలికొదిలేసిన సాగునీటి రంగాన్ని గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. ఇందులో భాగంగా ఇప్పుడు సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసింది. ఈ నేపథ్యంలో కీలకమైన చెరువులు, జలాశయాల సంఘాలను దక్కించుకోవడానికి కొంతమంది నేతలు ప్రయత్నిస్తున్నారు. ఒక్కో సంఘానికి అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు సహా ఆరుగురు సభ్యులను ఎన్నుకుంటారు.

## ప్రభుత్వంతో రాజీలేని పోరాటం

కోట, డిసెంబర్ 12 ప్రభాతవార్త : కూటమి ప్రభుత్వంతో రాజీలేని పోరాటం వైసీపీ కొనసాగిస్తుందని కోట మండల వైసీపీ కన్వీనర్ పలగాటి సంపత్ కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన కోటలో విలేకరులతో మాట్లాడుతూ అన్నదాత కష్టాలు వర్ణనాతీతంగా మారాయని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులు పడరాని పాట్లు పడుతున్నారని చెప్పారు. ఏటా సీజన్‌కు ముందే అందే పెట్టుబడి సాయం ఇంతవరకు అందించలేదని తెలిపారు. పంటల బీమా పరిహారం జాడే లేదని విమర్శించారు. కరువు సహాయం ఊసేలేదని, సున్నావడ్డీ రాయితీ లేదని, సకాలంలో విత్తనాలు ఎరువులు అందడం లేదన్నారు.

## కార్పొరేట్ ఆసుపత్రులలో... ఆరోగ్యశ్రీ అమలకు చర్యలు : ఎమ్మెల్యే



గూడూరు, డిసెంబర్ 12 ప్రభాతవార్త : అధిక సంఖ్యలో కార్పొరేట్ ఆసుపత్రులలో ఆరోగ్యశ్రీ అమలు అయ్యే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే సునీల్‌కుమార్ తెలి పారు. గూడూరు పట్టణంలోని గూడూరు పిఆర్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మెగా వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే సునీల్ కుమార్ ప్రారంభిం చారు. ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ వైద్య శిబిరంలో అనేక రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేయడం అభినందనీయమని అన్నారు. పిఆర్ క్లబ్ పేదలకు సేవలు అందించాలని ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పేద ప్రజలు ఇలాంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కమిటీ సభ్యులు మీరారెడ్డి, గోపాల్‌రెడ్డి, రామ్మోహన్రావు, మధుసూదన్‌రెడ్డి, నవీన్ కుమార్, వెంకటేశ్వరరావు, శ్రీనివాసులు, శ్రీధర్, నవీన్ కుమార్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## రెడ్డిపాలెం బిట్ 1లో రెవెన్యూ సదస్సు



వాకాడు, డిసెంబర్ 12 ప్రభాతవార్త : వాకాడు మండలం నిడి గుర్తి గ్రామంలో సచివాలయంలోని గురువారం సర్పంచ్ నాగరాజు అధ్యక్షతన రెవిన్యూ సదస్సు ప్రారంభమైంది. ఈ సదస్సులకి తాసిల్దార్ రామయ్య, ఎంపీడీవో అన్నపూర్ణ రావు, డిప్యూటీ తహశీల్దార్ సందీప్‌కుమార్, మండల సర్వేయార్ శకుంతల, రెవిన్యూ ఇన్స్పెక్టర్ అఖిల్ యాదవ్, వివిధ శాఖల సిబ్బంది, టిడిపి నాయకులు తీపలపూడి రమణయ్య, బుజిగేంద్రరావు, బిజెపి నాయకుడు సంపత్ కుమార్, కిషోర్‌రెడ్డి, కుంచా విజయరత్నం, రైతులు తదితరులు పాల్గొన్నారు. ఈ సదస్సులో సర్పంచ్ నాగరాజు మాట్లాడుతూ సదస్సులో వచ్చినటువంటి ప్రతి సమస్యను అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని పరిష్కరించాలని అధికా రులను కోరారు. ఎంపీడీవో అన్నపూర్ణరావు మాట్లాడుతూ అభివృద్ధి పరంగా వచ్చినటువంటి అర్జీలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో అన్నారు.

## క్రిస్మస్ వేడుకలు ఎమ్మెల్యేకు ఆహ్వానం



గూడూరు, డిసెంబర్ 12 ప్రభాతవార్త : సార్వత్రిక ఎన్నికల్లో తన విజయానికి సహకరించిన క్రిస్టియన్స్‌కు కృతజ్ఞతలు తెలుపుకుంటూ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఈనెల 23వ తేదీన ప్రీ క్రిస్టమస్ వేడుకలను నిర్వహిస్తామని గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ పేర్కొన్నారు. గురువారం గూడూరు పట్టణంలోని విశ్రాంతి ఉద్యోగుల భవనంలో గూడూరు టౌన్, రూరల్ పాస్టర్స్ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే సునీల్ కుమార్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే కేక్ కట్ చేసి అనంతరం పాస్టర్స్‌కు బ్యాగులు పంపిణీ చేశారు. అనంతరం నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. క్రిస్టియన్లు అందరూ క్రిస్టమస్ పండుగను ఘనంగా జరుపుకోవాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు ప్రభుదాస్, రత్నశేఖర్, కోర్నిలీనియస్, డేవిడ్, యోహాను, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## తూపిలిపాలెంలో విద్యా వికాస కేంద్రం



వాకాడు, డిసెంబర్ 12 ప్రభాతవార్త : వాకాడు మండలం తూపిలిపాలెం మత్స్యకార గ్రామంలో గురువారం శ్రీ భారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యా వికాస కేంద్రాన్ని ప్రారంభించినట్లు శ్రీ భారత్ ట్రస్ట్ చైర్మన్ కె.కోటేశ్వరరావు తెలిపారు. మత్స్యకార పిల్లలకు సాయంత్రం పూట 2వ తరగతి నుంచి ఎనిమిదవ తరగతి వరకు విద్యతో పాటు, యోగాసనాలు, క్రీడలు, ఆరోగ్యం తదితర విషయాల పై విద్యార్థులకు శిక్షణ ద్వారా తెలియజేయడం జరుగుతుందన్నారు. ఈ పాఠశాల ప్రారంభం కార్యక్రమంలో మత్స్యకార సంక్షేమ సంఘం నాయకులు పామంజి పాలయ్య లక్ష్మణరావు, కొండూరు చిన్న వెంకటేశ్వర్లు, కాటంగారి కోటేశ్వరరావు, విద్యా వికాస కేంద్రం ఉపాధ్యాయురాలు కళాంజి తనీల తదితరులు పాల్గొన్నారు.

## రైతులు తప్పనిసరిగా పంటలు బీమా చేసుకోవాలి



బాలాయపల్లి, డిసెంబర్ 12 ప్రభాతవార్త : రబీ కాలం 24-25 నుండి రైతులు, స్వచ్ఛందంగా పంటల బీమా కొరకు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి శిరీష తెలిపారు. గతంలో ఉన్న ఉచిత పంటల బీమా పథకం, ఈ పంట ఆధారంగా, ఖరీఫ్ 2024తో ముగిసింది, ఇప్పుడు అనగా అక్టోబర్ 2024 నుండి, రెండు పంట బీమా పథకాలు అమలులో ఉన్నాయని తెలిపారు. పంట రుణం తీసుకోనటువంటి రైతులు, కామన్ సర్వీస్ సెంటర్ల లేదా స్వయంగా ఎన్సిఐపి పోర్టల్ నందు నమోదు చేసుకోగలరు.

## స్వయంశక్తితో యువతకు జీవనోపాధి



చంద్రగిరి, డిసెంబర్ 12 ప్రభాతవార్త: స్వయం శక్తితో నూతనంగా ఫర్నిషాప్‌ను ఏర్పాటు చేసుకుని యువతకు ఉపాధి కల్పిస్తున్న శానంబట్ల తులసిరెడ్డి అభినందనీయుడని ఎంఎల్ఏ పులివర్తి నాని అన్నారు. టిడిపి మండల ఉపాధ్యక్షుడు శానంబట్ల తులసిరెడ్డి పార్టీలో చురుకైన నాయకుడుగా పార్టీకి విశిష్ట సేవలందిస్తున్నారు. ఈ నేపథ్యంలో స్వయంశక్తితో గృహోపకరణాల దుకాణంను తొండవాడలో ఎంఎల్ఏ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించేందుకై కుటీర పరిశ్రమలను ప్రోత్సహించడంలో తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్‌భాషా, ఏజిపల్లిబాల, పులికంటి మోహన్ రెడ్డి, ధర్మయ్యగారి దేవేంద్ర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మహాభారతం ప్రవచనంతో భక్తిభావం



తిరుపతి(రవాణ), డిసెంబర్12ప్రభాతవార్త:తిరుపతినగరంలోని అన్నమాచార్య కళామందిరంలో భక్తిభావాన్ని నింపే మహాభారతం ప్రవచనాలు మొదలయ్యాయి. గురువారం తొలిరోజు సాయంత్రం ప్రవచనకర్త గరికపాటి రమేష్‌బాబు ఆదిపర్వం ప్రవచనం చేసి అందులోని విశేషాలను వివరించారు. 10రోజులుపాటు జరిగే ఈ ప్రవచనాలకునగరవాసులు, ఆధ్యాత్మికవేత్తలు తరలిరావాలని కోరారు. తొలిరోజు ప్రవచనకర్త గరికపాటిని రాయలసీమ రంగస్థలి సంస్థ చైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి, తొండమనాటి సుబ్రవణ్యంరెడ్డి, టీచర్ తిరుమలయయ్య,. వెంకట్రామయ్య,కోకిల, కొట్టేసుబ్రమణ్యంరెడ్డి, పురోహితుడు సురేష్‌స్వామి పాల్గొని ఆయనను దుశ్శాలువతో సన్మానించారు.

## పరమపవిత్రం...చక్రతీర్థముక్కోటి పూజలు



తిరుమల,డిసెంబర్ 12ప్రభాతవార్తప్రతినిధి: కార్తీకమాసంలో చక్రతీర్థముక్కోటి పూజలు చక్రతీర్థంలో గురువారం ఉదయం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు, పరిచారకులు చక్రతీర్థంలో చక్రత్తా ళ్వారుకు, నరసింహస్వామికి, ఆంజనేయ స్వామికి అభిషేకం, పుష్పాలంకరణ చేపట్టి హారతులిచ్చారు. భక్తులకురక్షణ కల్పించాలని వేడుకున్నారు.

## ధనిక జిల్లా జాబితాలో తిరుపతి!



తిరుపతి(రవాణ), డిసెంబర్12ప్రభాతవార్త: స్మార్టుసిటీ,ఆధ్యాత్మికనగరం తిరుపతి జిల్లా రానున్న రోజుల్లో అభివృద్ధిపరంగా, ఆర్థికంగా ధనికజిల్లా జాబితాలో ముందు వరుసలోకి రానుందని అధికారిక వర్గాలు సమాచారం. గత రెండు రోజులు విజయవాడలో జరిగిన జిల్లా కలెక్టర్లు, ఎస్పీల సమావేశంలో ఆయా జిల్లాల స్థూల ఉత్పత్తిని ప్రతిబింబించే జిడిడిపి అంచనాల నేపథ్యంలో తిరుపతి జిల్లా రెండోస్థానంలో రానుంది. తాజాగా విడుదలైన అంచనాల జాబితాలో ఇందరులో విశాఖపట్నం జిల్లా మొదటి స్థానంలో ఉండగా ప్రస్తుతం రెండు, మూడో స్థానాల్లో ఉన్న ఎన్టీఆర్‌జిల్లా, కృష్ణాజిల్లాలు, నాల్గవస్థానంలో ఉన్న తిరుపతి జిల్లా ఈ ఆర్థిక సంవత్సరంలో రెండోస్థానంలో చేరనుంది. దీన్నిబట్టి జిల్లా కలెక్టర్ తిరుపతి జిల్లా ఆర్థిక అభివృద్ధికి మరింత చొరవచూపాలని సిఎం సూచించినట్లు సమాచారం. తిరుపతి యాత్రా స్థలంగానేగాక పుణ్యక్షేత్రం కూడా. ఇక్కడకు నిత్యం 60వేలమంది యాత్రికులు, ఇతరత్రా అవసరాల నిమిత్తం మరో 20వేల మంది వరకు వస్తున్నట్లు సమాచారం. ఇంకా విశ్వవిద్యాలయాలు, విద్యా సంస్థలు ఉన్నాయి. వీటన్నిటితో ఆర్థికంగా మరింతగా అభివృద్ధిచెందే అవకాశం ఉండటంతో తిరుపతి ఆర్థికంగా ముందుకు వెళ్ళే సూచనలు ఉన్నాయనేది సిఎం చంద్రబాబునాయుడు ఆకాంక్ష .

## గ్రామాల మధ్య ఆగిపోయిన రాకపోకలు..!

**-నారాయణవనంలో 94మి.మీ వర్షపాతం నమోదు**



నారాయణవనం, డిసెంబర్ 12 ప్రభాత వార్త : బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ తో అరుణానది బ్రిడ్జిలపై వరదనీరు ఉధృ తంగా ప్రవహిస్తున్నది. ఎగువ ప్రాంతం నుంచి నీరు ఉధృతంగా ప్రవహించడంతో అరుణానది కాజ్‌వేలపై నీటి ప్రవాహంతో బుధ, గురువారం రాకపోకలు ఆగి పోయింది. కురిసిన వర్షానికి కాజ్‌వేలపై వరద ప్రవాహం వచ్చింది. భారీ వర్షం కురుస్తుండడంతో నారాయణవనం-తిరువట్యం, నారాయణవనం-మిట్ట కీళగరం,నారాయణవనం- కశింమిట్ట, సముదాయం- బొబ్బరాజుపాలెం, తుంబూరు-మెయిన్‌రోడ్డు, పాల మంగళం-మెయిన్‌రోడ్డు మధ్య రాకపోకలు ఆగిపోయింది. మండలంలో గురువారం 5గంటల వరకు 94మిమీటర్ల వర్షాపాతం నమోదు అయినట్టు తహశీల్దారు ఎం జయరాములు తెలిపారు.

## మనోధైర్యానికి భగవద్గీత పఠించడమే శరణ్యం

**-వేదపండిత రామనాధశర్మ**



పుంగనూరు,డిసెంబరు 12 ప్రభాతవార్త : ప్రపంచ మానవాళికి మనోధైర్యం ప్రసాదించేందుకే భగవాన్ వాసుదేవులు కురుక్షేత్రంలో గీతను బోధించి ముందుకు నడిపించారని వేదపండితులు, జ్యోతిష్యరత్న రామ నాధశర్మ అన్నారు.భగవద్గీతా జయంతి సందర్భంగా పట్టణంలోని శ్రీత్యాగరాజస్వామి ఆలయంలో దివ్యజ్ఞాన జ్యోతి సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు మునెప్పగారి వేంకటేశ్ అధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు భగవద్గీత చక్కటి మనోధైర్యాన్ని, భవిష్యత్తు మార్గదర్శకాన్ని అందిస్తుందన్నారు. విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో నిత్యం ప్రార్థనా సమయంలో గీతాబోధన నిర్వహించాలని సూచించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు వేంకటపతి మాట్లా డుతూ నిత్యం భగవద్గీతలో కనీసం రెండు శ్లోకాలు పఠించడం అలవాటు చేసుకుంటే జీవిత ప్రయాణం సద్గతిలో నడుస్తుందని, విద్యార్థి దశనుంచి గీతా పఠనం, శ్రీవిష్ణుసహస్రనామం పఠించడం వల్ల ఎందరో జీవితాలను చక్కదిద్దు కున్నారన్నారు. పుంగనూరు బసవరాజ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల కమిటీ ఛైర్మన్ టిపిఎస్ నాగరాజ మాట్లాడుతూ హిందూదేశంలో భగవద్గీత ప్రామాణికంగా భారత అత్యున్నత న్యాయస్థానం మొదలు అన్ని వ్యవస్థలూ ముందుకు నడిచే క్రమంలో భగవద్గీతను తప్పనిసరిగా పాఠ్యాంశాలలో చేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీచర్ భద్రయ్యతో పాటూ పలువురు పాల్గొన్నారు. ఈసందర్భంగా శ్రీభగవద్గీతాపారాయణం జరిగింది.

## వర్షంతో పొంగి ప్రవహిస్తున్న కైవల్య నది



వెంకటగిరి, డిసెంబర్ 12 ప్రభాతవార్త : బంగాళాఖాతం ఏర్పడిన అల్పపీడనం కారణంగా వెంకటగిరి ప్రాంతంలో భారీ వర్షం కురిసింది. భారీ వర్షం కారణంగా కైవల్యా నది,గొడ్డేరు వాగులు పొంగి ప్రవహిం చాయి. రైతులు పోసిన వరినారు మళ్లు కూడా వర్షానికి కొట్టుకుపోయినట్లు గ్రామస్తులు వాపో యారు. కుండపోత వర్షం కారణంగా ప్రజా జీవనం స్తంభించింది. భారీగావర్షం పడడంతో పోసిన వరి నారుమళ్ళూ నాటిన వరి కొట్టుకు పోయినట్లు రైతులు వాపోయారు. ఎడతెరిపి లేకుండా వర్షం పడడం వల్ల వీధులను జలమయం అయ్యాయి. భారీ వర్షంతో చెరువులు ఎక్కడ తెగిపోతాయో అని రైతులు వాపోతున్నారు.

## లక్ష రూపాయల సభ్యత్వం తీసుకున్న రమణయ్య



గూడూరు, డిసెంబర్ 12 ప్రభాతవార్త: : తెలుగుదేశం పార్టీ సభ్యత్వం నమోదు కార్యక్రమంలో భాగంగా శాసన సభ్యులు, పాశం సునీల్ కుమార్ సూచనలతో లక్ష రూపాయల సభ్యత్వంను అమరావతి హాస్పిటల్ అధినేత డాక్టర్ రమణయ్య తీసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ప్రజలకు ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ఒక చంద్రబాబు నాయుడుకే సాధ్యమని వారు తెలిపారు.

## పార్టీకి ఎల్లవేళలా అండగా ఉంటా

**-వైసిపి నియోజకవర్గం నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి**



వెంకటగిరి, డిసెంబర్ 12 ప్రభాతవార్త : వైసిపి పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటానని నియోజకవర్గ సమన్వయకర్త మేదరుమల్లి రామ్ కుమార్ రెడ్డి తెలిపారు. వెంకటగిరిపట్నం 16వార్డుకు చెందిన కౌన్సిలర్ ధనియాల రాధా అనారోగ్యంతో బాధపడుతూ ఉండడంతో ఇంటికి వెళ్లి పరామర్శించారు. మాజీ కౌన్సిలర రోసిరెడ్డి సత్యమని మృతి చెందడంతో ఆయన ఇంటికి వెళ్లి పలకరించారు. కౌన్సిలర్ ధనియాలు రాధాను పలకరించి ఆరోగ్య విషయమై అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ బాలయ్య కౌన్సిలర్లు కళ్యాణి, వాయిదా రత్నంరెడ్డి, బండి రమేష్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

## వరద నష్టం జరగకుండా సహాయక చర్యలు : ఎమ్మెల్యే



వెంకటగిరి, డిసెంబర్ 12 ప్రభాతవార్త : తుఫాన్ కారణంగా వచ్చిన వరద వల్ల ఎలాంటి నష్టం జరగకుండా ఏర్పాట్లు చేసినట్లు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరి పట్టణంలోని మల్లమ్మ గుడివీధి వద్ద కాజువేపై పొంగి ప్రవహిస్తున్న కైవల్య నది, గొడ్డేరు వాగులను పరిశీలించారు. మల్లమ్మ గుడి వద్ద కైవల్యా అనేది కాజ్వేపై పొంగి ప్రవహిస్తున్నతో జెసిబి ద్వారా అడ్డంవలన చెత్తాచెదారాన్ని తొలగింపు చేశారు. అధికార యంత్రాంగాన్ని సహాయ చర్యలు అందించేందుకు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఎప్పుడు ఎలాంటి సమస్య వచ్చినా ఆదుకునేందుకు అధికార యంత్రాంగం తాను సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎస్పై సుబ్బారావు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాజేశ్వరరావు మాజీ కౌన్సిలర్ మధుసూదన్ రెడ్డి, టిడిపి నాయకులు సురేష్ చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తీశ్వరాలయంలో బాలదీపం



శ్రీకాళహస్తి,డిసెంబర్ 12 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురువారం రాత్రి అంగరంగ వైభవంగా బాలదీపం కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ఇఓ టి.బాపిరెడ్డి దంపతుల సంకల్పంతో ఈ కార్యక్రమాలు సాగాయి. అమ్మవారి ఆలయం వద్ద ఆలయ అర్చకులు వేదపండితులు వేద మంత్రాలను పఠిస్తుండగా కలశ స్థాపన జరిపారు.ఆలయ అర్చకులు నిరంజన్ గురుకుల్ పూజలు జరుపుతూ హోమాలు ఏర్పాటు చేసారు. స్థానిక ఆచారం,సంప్రదాయం ప్రకారం పౌరోహితులు అర్ధగిరి స్వామిని మంత్రాలను జపిస్తుండగా ఏర్పాట్లను ఎఇఓ లోకేష్‌రెడ్డి పర్యవేక్షించారు. హోమాలు నిర్వహించి హోమాల్లో ఆలయ ఇఓ బాపిరెడ్డి దంపతులు పూర్ణాహుతి గావించారు.బాలాదీపాలను ఆలయంలో ఊరేగింపు జరిపారు. వీటిని శుక్రవారం సాయంత్రం వరకు దేవేరి జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారి ఆలయంలో వెలగనిస్తారు. అమ్మవారి గర్భగుడి ఎదురుగా బాల దీపాలను వెలిగించి ఊరేగింపుగా ఆలయంలోని నాలుగు ప్రాంతాల్లో ఉత్సవం జరిపి అమ్మవారి గర్భగుడి ఎదురుగా ఏర్పాటు చేసారు. ఈ బాల దీపాలతో శుక్రవారం రాత్రి చొక్కాణి చెట్టును కాల్చుతారు. అగ్నితో స్వామికి అభిషేకిస్తారు.

## స్వర్ణముఖి పాత వంతెనపై వరద నీరు

శ్రీకాళహస్తి,డిసెంబర్ 12 ప్రభాతవార్త : స్వర్ణముఖి న దిలో వరద ముంచెత్తుతుంది. గురువారం రాత్రి 9.30గంటల సమయంలో వరద నీరు పాత రామసేతు వంతెనపై నుంచి ప్రవహించింది, రెండు వంతెనల శ్లాబ్‌ను తాకింది. ఈ ఏడాది అంచనాలకు మించి వర్షం అల్పపీడనాలు, తుఫాన్లుతో కురుస్తున్నాయి. గురువారం ఉదయం నుంచి కురిసిన వర్షంతో చెరువులు నిండాయి. నీరు నదిలో చేరుతుంది. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి వరద నీరు స్వర్ణముఖి నదిపై బ్రిటిష్ కాలంలో నిర్మించిన రామసేతు వంతెనపైకి ప్రవహించింది. ఈ వంతెనపై 1984లో ఒక సారి కళ్యాణి రిజర్వాయర్ గేట్ తెగటంతో నీరు ప్రవహించింది.మళ్ళీ 30 సంవత్సరాల తరువాత గురువారం వంతెనపై నీరు ప్రవహించటంతో పట్టణ ప్రజలు దర్గా వాసులు భయభ్రాతులౌతున్నారు.